Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 63 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 మార్చి 2023 ఆదివారం పేజీలు : 4

### చైనా ఆర్థిక రాజధాని షాంఘైలో లాక్‌డౌన్ పొడిగింపు..!

చైనా ఆర్థిక రాజధాని షాంఘైలో లాక్‌డౌన్‌ను నేడు మరోసారి పొడిగించినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఈ సారి నగరంలోని 2.5 కోట్ల మంది జనాభా మొత్తం కొన్నాళ్లు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నగరంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో తీవ్ర ఆంక్షలు విధించారు. కానీ, తాజాగా నగరం మొత్తం కఠిన ఆంక్షలను విధించారు. కానీ, తాజా నిర్ణయం నగరం మొత్తానికి వర్తించనుంది. చైనా ఆర్థిక రాజధానిగా పేరున్న ఈ నగరంపై కరోనా వైరస్ పంజా విసరడంతో రోజువారీ రికార్డు స్థాయిలో కేసులు నమోదవుతున్నాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కఠిన నిబంధనలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇంటి బయటకు రావడానికి కూడా వీల్లేదు. దీంతో ఇక్కడి వారు ఆహారం, తాగునీటిని కూడా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించుకొంటున్నారు. కొన్ని రకాల ఆహార పదార్థాలు అసలు ఆన్‌లైన్‌లోనే ఉండకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### రష్యన్ దౌత్యవేత్తలను బహిష్కరించిన ఇటలీ, డెన్మార్క్‌లు..

బుచ్చాలో రష్యన్ బలగాల మారణహోమాన్ని ప్రపంచ దేశాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఇటలీ, డెన్మార్క్‌లు.. తమ దేశంలోని 30, 15 మంది రష్యా దౌత్యవేత్తలను బహిష్కరించాయి. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇటలీ విదేశాంగ మంత్రి లుగి ది మేయో వెల్లడించారు. మాస్కోతో దౌత్య సంబంధాలను తెంచుకోవడం తమకు ఇష్టం లేదని.. రష్యా రాయబారి, మిగిలిన సిబ్బంది ఈ బహిష్కరణలో భాగం కాదని డెన్మార్క్ విదేశాంగశాఖ పేర్కొంది. అయితే, డెన్మార్క్ నిర్ణయంపై ప్రతిస్పందిస్తామని రష్యా విదేశాంగ శాఖ పేర్కొన్నట్లు స్థానిక వార్తాసంస్థ తెలిపింది.



# మోదీజీ... పెట్రో మంటలు

# చల్లార్చండి ప్లీజ్ !

పెట్రో ధరలు ఓ వైపు పెరిగిపోతున్నాయి. కరెంట్ ఛార్జీలు పెరిగిపోతున్నాయి. ఒక్క ఏపీలోనే విద్యుత్ ఛార్జీల వడ్డన అన్నీ కలుపుకు నాలుగు వేల కోట్లకు పైగా ఉంది. (ట్రూ అప్ పేరిట 2900 కోట్లు..ఛార్జీల పేరిట 1400 కోట్లు). ఇదే సమయంలో టోల్ ఛార్జీలు కూడా పెరగనున్నాయి అని తెలుస్తోంది. రాష్ట్ర పరిధిలో ఉన్న మేరకు టోల్ ఛార్జీలు కూడా పెంచాలని గౌరవ ముఖ్యమంత్రి జగన్ యోచిస్తున్నారు. అంటే మోడీ మరియు జగన్ ఒకే విధంగా ఆలోచిస్తున్నారన్నది తేలిపోయింది. ఇంటి పన్నులు వసూలు పేరిట ఓ రెండు వేల కోట్లు చెత్త పన్ను వసూలు పేరిట ఎలా చూసుకున్నా ఓ రెండు వేల కోట్లు వసూలు రంగం సిద్ధ అయింది ఏపీలో ! వీటికి తోడు మోడీ ఛార్జీల వడ్డన ఉండనే ఉంది. ఇలాంటి సమయంలో జగన్ సర్కారు కానీ జనతా సర్కారు కానీ ప్రజలకు చేస్తున్నదేంటి అన్న ప్రశ్న ఒకటి విపక్షం నుంచి వస్తున్నది. పెట్రో ధరలు పక్క రాష్ట్రంతో పోలిస్తే ఏపీలో ఎక్కువ. అదేవిధంగా వంట నూనెల ధరలు కూడా పక్క రాష్ట్రంలో కన్నా ఏపీలోనే ఎక్కువ. ధరల నియంత్రణకు రాష్ట్రాలు మరియు కేంద్రం ఉమ్మడి ప్రణాళికతో ఎందుకు ముందుకు వెళ్లడం లేదన్న వాదన ఒకటి బలీయంగా వినవస్తోంది ప్రజల నుంచి..!

**- సీతాదేవి పుట్టిన దేశం నేపాల్లో లీటర్ పెట్రోల్ రూ.97/-**

**- రావణుడి శ్రీలంకలో రూ.72/-**

**- రాముడు పుట్టిన భారతదేశంలో మాత్రం రూ.116/-**

వాస్తవానికి మోడీ ప్రభుత్వం కానీ జగన్ సర్కారు కానీ తాము అధికారంలోకి వచ్చాక ధరల నియంత్రణకే తొలి ప్రాధాన్యం అని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుతాం అని చెప్పారు. అంతేకాకుండా ఓఎన్జీసీ లాంటి సంస్థలకు మరింత ప్రగతి అందిస్తాం అని చెప్పారు. కానీ ఇప్పుడు ఇవేవీ కాకుండా కొత్త పంథాలో ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణకు మోడీ ప్రాధాన్యం ఇస్తున్నారు.

అదేవిధంగా స్థానికంగా లభ్యమయ్యే చమురు నిక్షేపాలను ప్రయివేటుపరం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓఎన్జీసీ లో వాటాలు అమ్ముకునేందుకు కూడా మోడీ ప్రయత్నిస్తున్నారు. ఇక జగన్ కూడా కొన్ని విషయాల్లో అస్సలు కేంద్రాన్ని ప్రశ్నించలేకపోతున్నారు. ఆరోజు విద్యుత్ ఛార్జీల పెంపు విషయమై చంద్రబాబును విపరీతంగా విమర్శించిన జగన్ ఇప్పుడు మాత్రం వేర్వేరు మార్గాలలో వడ్డనను షురూ చేస్తున్నారు. ఏ విధంగా చూసుకున్నా అటు కేంద్రం ఇటు రాష్ట్రం ధరల నియంత్రణకు తీసుకున్న చర్యలు శూన్యం. ఓ విధంగా ఆర్థిక ప్రగతి కాస్తో కూస్తో ఆశించిన స్థితిలో ఉన్న రోజుల్లోనే పన్నుల వడ్డన పేరిట ప్రజలను అదే పనిగా ఇబ్బంది పెట్టడం అన్నది భావ్యం కాదనిఇప్పుడిప్పుడే కరోనా నుంచి కోలుకుంటున్న వ్యవస్థలకు ఇదొక ఆశాభంగం అని అంటున్నాయి విపక్షాలు.

పెట్రోలు గ్యాస్ డీజిల్ కరెంట్ ఛార్జీల పెంపుదలతో ఒకే సారి ఇరు ప్రభుత్వాలూ చేస్తున్న దాడి నుంచి తప్పుకోవడం సాధ్యం కాని పని అయినా కూడా ఒక్క అడుగు వెనక్కు వేసేందుకు ఇరు ప్రభుత్వాలూ ఆలోచించడం లేదు అని గగ్గోలు పెడుతున్నాయి.




### పార్లమెంటులో ఉన్నా లేకున్నా దేశం కోసం పోరాడతా: రాహుల్

న్యూఢిల్లీ: సూరత్ కోర్టు జైలు శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పు, ఆ తర్వాత కొద్ది గంటలకే ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8 కింద తనపై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ సంచలన ఉత్తర్వులు విడుదల చేయడంపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తొలిసారి స్పందించారు. "ఈ దేశం నాకు అన్నీ ఇచ్చింది. దేశం కోసం పోరాడతా" అని అన్నారు. తనను శాశ్వతంగా అనర్హుడిగా ప్రకటించినా, తన పని తాను చేసుకుంటూనే పోతానని, పార్లమెంటులో ఉన్నానా లేనా అనేది ప్రశ్న కాదని చెప్పారు. దేశం కోసం తాను పోరాటం సాగిస్తూనే ఉంటానని చెప్పారు.

**ప్రధాని కళ్లలో భయం చూసా...** అదానీపై తన తదుపరి ప్రసంగం ఎలా ఉంటుందోనని ప్రధామంత్రికి భయం పట్టుకుందని, ఆ భయం ఆయన కళ్లలో తాను చూశానని ప్రధాని అన్నారు. అందువల్లే తొలుత తనపై వక్రీకరణలు చేశారనీ , ఇప్పుడు అనర్హత వేటు వేశారని ఆరోపించారు. నిజం మాట్లాడటం మినహా తనకు వేరేవాటిపై ఆసక్తి లేదని, నిజమే మాట్లాడతానని, తనపై అనర్హత వేటు వేసినా, అరెస్టు చేసినా నిజం కోసం పని చేస్తానని చెప్పారు. ఈ దేశం తనకు అన్నీ ఇచ్చిందని, దేశం కోసమే తాను పనిచేస్తానని అన్నారు. దేశ ప్రజాస్వామ్య స్వభావాన్ని, దేశ వ్యవస్థలను పరిరక్షించడమే తన పని అని, దేశంలోని పేద ప్రజల గళానికి బాసటగా నిలబడటం, అదానీ వంటి వ్యక్తులు ప్రధానితో తమకున్న సంబంధాలతో దేశాన్ని ఎలా వంచిస్తున్నారో ప్రజల ముందుకు వెళ్లి వివరిస్తానని చెప్పారు.

# యువతను టార్గెట్ చేసిన బీఆర్ఎస్



హైదరాబాద్ : తెలంగాణలో హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్ స్కెచ్ వేస్తోంది. రెండు పర్యాయాలు తమ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని చెబుతూనే.. మరికొన్ని కొత్త స్కీంలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్లాన్ వేస్తున్నారు. మొత్తంగా అన్ని వర్గాలను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏనిమిదేళ్లుగా జాబ్ నోటిఫికేషన్లు లేకపోవడంతో బీఆర్ఎస్ పై యువత అసంతృప్తితో ఉన్నట్లు బీఆర్ఎస్ గ్రహించింది. ఈ అసంతృప్తే బీజేపీకి ప్లస్ పాయింట్ గా మారింది. పట్టణ ప్రాంతాల్లోని యువత ఎక్కువగా బీజేపీ వైపు చూస్తున్నట్లు సర్వేల ద్వారా తేలుతోంది. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో ప్రతికూల పవనాలు వీచే ఆస్కారం ఉన్నందున బీఆర్ఎస్ వెంటనే అలర్ట్ అయింది. యూత్ ను టార్గెట్ చేసి వారికి అనుకూలంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టింది. గత ఎన్నికల్లో యువతను ఆకట్టుకోవడానికి క్రికెట్ కిట్లు బహుమతులు ఇచ్చే వారు. కానీ ఇప్పుడు అలాంటి వాటికి యూత్ అట్రాక్ట్ కావడం లేదు. చాలా మంది జాబ్ నోటిపికేషన్లు ఇవ్వలేదని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా మారుతున్న బీజేపీ యూత్ కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తోంది. కొన్ని నియోజకవర్గాలను యూత్ కే అప్పగించడంతో వారు ఉత్సాహం పనిచేస్తున్నారు. ఇది గమనించిన బీఆర్ఎస్ అప్రమత్తమైంది. వెంటనే యూత్ ను వలలో వేసుకునేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కొందరు బీఆర్ఎస్ కు చెందిన మంత్రులు ఎమ్మెల్యే జాబ్ మేళాలను నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీలతో మాట్లాడి వారికి ఎలాగైనా ఉద్యోగం పెట్టించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక విద్యావంతులకు అవసరమైన పరికరాలను అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల సామూహిక వివాహ కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నారు. కొంత మంది పేదకుటుంబాల్లో ఉన్న యువతను లక్ష్యంగా చేసుకొని వారికి పెళ్లిళ్లు చేయిస్తున్నారు. పెళ్లి చేయడంతో పాటు వారికి అవసరమైన సాయం చేస్తున్నారు. ఇవే కాకుండా ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా 80 వేల ఉద్యోగాలు ప్రకటించి ఆకర్షించారు. ఇక ఈ పరీక్షలకు ప్రిపేరయ్యే వారికి పుస్తకాలు తదితర స్టడీ మెటీరియల్ ను ఉచితంగా అందిస్తున్నారు. అయితే ఇందులో గ్రూప్ 4 పరీక్ష తేది ప్రకటించినా మిగతావాటిపై మాత్రం నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో నిరుద్యోగుల్లో అయోమయం నెలకొంది. ఏదీ ఏమైనా బీఆర్ఎస్ పై ఉన్న అసంతృప్తిని తొలగించేందుకు బీఆర్ఎస్ చేపడుతున్న కార్యక్రమాలపై చర్చనీయాంశంగా మారుతున్నాయి.




# పార్లమెంట్ వద్దు... అసెంబ్లీయే ముద్దు... అంటున్న తెలంగాణ లీడర్లు..!

# ఢిల్లీ వదిలి గల్లీకి

హైదరాబాద్ : తెలంగాణ లీడర్లు ఢిల్లీ వదిలి గల్లీ బాట పట్టనున్నారా..? పార్లమెంటుతో పోలిస్తే అసెంబ్లీ స్థానమే తమకు సురక్షితమని భావిస్తున్నారా..? ఆ దిశగా ఆయా పార్టీల అధిష్ఠానాల వద్ద ప్రయత్నాలు చేస్తున్నారా..? ప్రస్తుత ఎంపీలతో పాటు మాజీ ఎంపీలు కూడా అసెంబ్లీపై కన్నేశారా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ముందుగా అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి ఈ జాబితా ఎక్కువగా ఉంది. ఎంపీ స్థానం కంటే అంసెబ్లీ పైనే తమ ఫోకస్ ఎక్కువగా పెట్టారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఈ సారి దుబ్బాక అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రామలింగా రెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో ఆయన సతీమణికి టికెట్ కేటాయిస్తే ఆమె స్వల్ప తేడాతో ఓటమి చవిచూశారు. ఈసారి అక్కడి నుంచి ప్రభాకర్ రెడ్డి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. అలాగే మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత కూడా మహబూబాబాద్ అసెంబ్లీ బరిలో దిగేందుకు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఈమె గతంలో ఇదే అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. మరోసారి ఇక్కడి నుంచి పోటీకి గట్టిగానే కృషి చేస్తున్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మరోసారి ఎంపీగా పోటీకి అనాసక్తిగా ఉన్నారు. రంగారెడ్డి శివార్లలోని ఏదో ఒక అసెంబ్లీ స్థానం కోసం అధినేత వద్ద పట్టుబడుతున్నారు. వీరితో పాటు ఖమ్మం ఆదిలాబాద్ మాజీ ఎంపీలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నగేశ్ కూడా అసెంబ్లీకే మొగ్గు చూపుతున్నారు. క్రితం సారి సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి ఓడిన మంత్రి తలసాని కుమారుడు సాయికిరణ్ కూడా అసెంబ్లీకే ట్రై చేస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీలుగా ఉన్న రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోమటి రెడ్డి వెంకట రెడ్డి ఈసారి కచ్చితంగా ఎమ్మెల్యేలుగా పోటీ చేయాలని భావిస్తున్నారు. రేవంత్ కొడంగల్ నుంచి.. కోమటి రెడ్డి నల్లగొండ నుంచి.. ఉత్తమ్ కోదాడ నుంచి పోటీలో ఉండబోతున్నారు. వీరు ముగ్గరు సీఎం పదవికి పోటీదారులే కావడం విశేషం. వీరితో పాటు మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్ బలరాం నాయక్ అంజన్ కుమార్ యాదవ్ కూడా ఎమ్మెల్యే టికెట్లే ఆశిస్తున్నారు.

ఇక బీజేపీ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈసారి అంబర్ పేట అసెంబ్లీ బరిలో ఉండనున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ లేదా వేములవాడ అసెంబ్లీ స్థానాలపై గురి పెట్టారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు కూడా అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్నారు. క్రితం సారి ఎంపీ స్థానాలకు పోటీ చేసిన జితేందర్ రెడ్డి తూళ్ల వీరేందర్ గౌడ్ కూడా లోకల్ గానే ఉండాలని భావిస్తున్నారు. వీళ్లందరి ఆశలు ఏ మేరకు నెరవేరుతాయో.. పార్టీలు ఎవరికి మద్దతు ఇస్తాయో వేచి చూడాలి.

# సంపాదకీయం

## రూపాయి విలువ పడిపోయిన లాభమే!

రూపాయి విలువ డాలర్ తో పోల్చితే రోజు రోజుకు మరింత దిగజారుతుంది. గత నాలుగేళ్లలో దీని విలువ సుమారు 20 శాతానికి పైగా తగ్గింది. 2018 లో డాలర్ తో రూపాయి మారకం విలువ రూ. 63 ఉండగా.. ప్రస్తుతం అది భారీగా పెరిగి.. రూ. 77 లకు చేరింది. ఇటీవల కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణం తో పోల్చిన.. రూపాయి మారకం విలువ చాలా కనిష్ఠానికి తాకిందని నిపుణులు చెబుతున్నారు. గత వారంలో రూపాయి ఎన్నడు లేనంతగా పతనం అయ్యి జీవన కాల కనిష్ఠానికి తాకినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ కరెన్సీ అయిన డాలర్ తో పోల్చి చూస్తే.. రూపాయి పతనం మరింత దారుణంగా ఉందని ఆర్థిక వేత్తలు అంటున్నారు. ఇలా రూపాయి మారకం పతనం చెందడం కారణంగా సామాన్యుడి పై మరింత భారం పుడుతుందని చెపుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి కి డిమాండ్ లేకపోవడంతో దీని విలువ మరింతగా పడిపోతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశీ మదుపరులు లేకపోడం తో పాటు పెట్టుబడులు పెట్టే వారు కూడా అంతంత మాత్రంగా ఉండటం పతనానికి దారి తీస్తుంది. భారత్ నుంచి పెద్ద మొత్తంలో వస్తువుల ఎగుమతి లేకపోవడం కూడా దీనికి ప్రధాన కారణంగా నిలుస్తుంది. అంతేగాకుండా భారత్ దిగుమతులు ఎక్కువగా చేసుకుంటుంది. దీంతో చెల్లింపులు కచ్చితంగా డాలర్లలోనే చేపట్టాలి. ఈ నేపథ్యంలో డాలర్ తో పోల్చితే రూపాయి విలువ పడిపోతుంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ పడిపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. దీనికి ప్రధానమైంది. విదేశీ మదుపరులు తమ డబ్బను వెనక్కి తీసుకోవడం. అంటే భారత మార్కెట్లో వారు పెట్టిన డబ్బును తిరిగి వెనక్కి తీసుకోవడం. ఇది జరిగిన ప్రతీసారి మార్కెట్ పడుతుంది. దానితో పాటే రూపాయి విలువ కోల్పోతుంది. మరో కారణం ఏమిటంటే భారత్ కు ముడి చమురు చాలా ప్రధాన సమస్య. దీని కోసం భారత్ ఇతర దేశాలపై ఆధారపడవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో చెల్లించిన డబ్బులు అంతా డాలర్ తోనే చెల్లిస్తున్నాం. దీంతో డాలర్ కు డిమాండ్ పెరిగి రూపాయి కి విలువ క్షీణిస్తుంది. రూపాయి విలువ తగ్గడం అనేది మనపై పడుతున్న భారానికి సాక్ష్యం అని నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుదలకు కూడా రూపాయి క్షీణించడంతో సంబంధం ఉంటుందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి ధర పడిన ప్రతీసారి ఆ ప్రభావం రూపాయి మీద పడి ఖర్చులు పెరుగుతాయి. ఆర్థికంగా సంబంధం ఉన్న ప్రతి దానికి రూపాయి తో సంబంధం ఉంటుంది. దీనిలో భాగంగానే రూపాయి విలువ పడితే ద్రవ్యోల్బణం పెరిగిపోయి వడ్డీ రేట్లు కూడా పెరుగుతాయి. ఇది కూడా సామాన్యుడిపై భారం గా పరిణమిస్తుంది. అందుకే ద్రవ్యోల్బణం పెరిగిన ప్రతీసారి ఆర్బీఐ కీలక వడ్డీరేట్లలో మార్పులు చేర్పులు చేస్తుంటుంది. మన పిల్లలు ఇతర దేశాల్లో చదవడంతో కూడా రూపాయి కి సంబంధం ఉంటుంది. ఎందుకంటే రూపాయి ఇతర దేశాల్లో చలామణి కాదు. దీంతో రూపాయిని డాలర్లకు మార్చుకోవాలి. అలా మార్చి కూడా డాలర్ డిమాండ్ పెరుగుతుంది. దీంతో రూపాయి విలువ తగ్గుతుంది. రూపాయి తగ్గితే వచ్చే ప్రయోజనాలు ఏంటో ఓ సారి తెలుసుకుందాం. డాలరుతో పోల్చితే రూపాయి పడిపోవడం అనేది మనపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కొన్ని విషయాల్లో ఇది మంచిగా కూడా మారుతుంది. అది ఎప్పుడు అంటే... మనం కానీ విదేశీ మార్కెట్లో మదుపు చేస్తూ ఉంటే రూపాయి పతనం చెందిన ప్రతి సారి మనకు వచ్చే దాని విలువ పెరుగుతుంది. దీనికి కారణం మనం పెట్టిన పెట్టుబడులు అనేది డాలర్లలో జరుగుతుంది కాబట్టి మనకు వచ్చే మొత్తం కూడా ఎక్కువగానే ఉంటుంది. దీనితో పాటు ఐటీ రంగంలో పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభం గా ఉంటుంది. కేవలం ఒక్క ఆ రంగంలో ఉండే వాటిలో మాత్రమే కాకుండా ఫార్మా ఎఫ్ఎంసీజీల్లో పెట్టినా కూడా భారీగానే ఆదాయం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## ఆసుపత్రి సరే.. వైద్యులేరి?



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా సంజీవనిగా చెప్పుకునే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైనా.. వైద్య సేవలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.300 కోట్ల వ్యయంతో ఆసుపత్రి భవన సముదాయం పనులు పూర్తయినా.. వైద్య పోస్టుల ఖాళీలు మాత్రం వెక్కిరిస్తూనే ఉన్నాయి. గత ఆరు నెలల క్రితమే ఆసుపత్రి ప్రారంభానికి అధికారులు సిద్ధం చేసినా.. వైద్య సిబ్బంది లేరన్న కారణంగా వాయిదా వేస్తూ వచ్చారు. గతంలోనే ప్రారంభ తేదీని కూడా ఖరారు చేసినా.. ఎంపీ సోయం బాపురావు అభ్యంతరం చెప్పడంతో మరోసారి వాయిదా పడింది. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు జిల్లా పర్యటన ఖరారు కావడంతో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ఎట్టకేలకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 2 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 54 మంది వైద్యులు పని చేయాల్సి ఉండగా.. కేవలం 30 మంది వైద్యులతోనే వైద్య సేవలను నెట్టుకొస్తున్నారు. దీంతో సరైన వైద్యం అందక జిల్లా వాసులు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని యవత్‌మాల్, నాగ్‌పూర్, కిన్వట్, చంద్రాపూర్ పట్టణాలతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ లాంటి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు.

తొమ్మిది మందితో వైద్య సేవలు ఎలా?

జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించి ఆదివాసీ గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 52 వైద్య పోస్టులను మంజూరు చేసింది. కాని ఇప్పటి వరకు 13 మంది వైద్యులు మాత్రమే విధుల్లో చేరారు. ఇందులో నలుగు రు వైద్యులు ఇటీవల వివిధ కారణాలతో విధులకు రాజీనామా చేసి వెళ్లిపోయారు. దీంతో తొమ్మిది మంది వైద్యులు మాత్రమే మిగిలారు. అరకొర వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించడం ఎలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా నలుగురు కార్డియాలజిస్టులు తప్పనిసరి కావాల్సి ఉండగా.. ఇందులోనూ ఒక్కరు కూడా విధుల్లో చేరలేదు. దీంతో ఆసుపత్రి నిర్వహణ కష్ట సాధ్యమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనుకబడిన జిల్లాకు వైద్యులెవరూ రావడం లేదంటూ అధికారులు చెబుతున్నా.. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కేవలం తొమ్మిది మంది వైద్యులతోనే నిర్వహించడం సాధ్యమయ్యే పని కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పత్తా లేని పల్లె దవాఖానాలు

గ్రామీణ వాసులకు మెరుగైన వైద్య సేవలను అందించే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే జిల్లాకు 42 పల్లె దవాఖానాలను మంజూరు చేసింది. ప్రతీ ఐదు వేల గ్రామీణ జనాభాకు ఒక వైద్యున్ని నియమించాలని ప్రభుత్వం భావించింది. కాని వైద్యులెవరూ విధుల్లో చేరకపోవడంతో పల్లె దవాఖానాలు పత్తా లేకుండానే పోయాయి. ఇప్పటికే జిల్లా అధికారులు పలుమార్లు నోటిఫికేషన్ విడుదల చేసినా.. ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు నలుగురు వైద్యులు మాత్రమే విధుల్లో చేరినా.. ఇటీవల ఇద్దరు వైద్యులు విధుల నుంచి తప్పుకున్నారు. మిగిలిన ఇద్దరు వైద్యులతో పల్లె దవాఖానాలను నిర్వహించ లేమని జిల్లా వైద్యాధికారులు చేతులెత్తేశారు. వైద్యుల నియామకంపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించక పోవడంతోనే వైద్య పోస్టులు ఖాళీగా కనిపిస్తున్నాయన్న విమర్శ లు వస్తున్నాయి. జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందని ద్రాక్షగానే మారాయన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అల్లాడుతున్న ఆదివాసీలు

ఆపద సమయంలో మెరుగైన వైద్య సేవలు అందక ఆదివాసీ గిరిజనులు అల్లాడుతున్నారు. జిల్లాలో ఉన్న 18 మండలాల పరిధిలో తొమ్మిది మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలోనే ఉన్నాయి. వీటి పరిధిలో 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయి. అయితే ఏ ఒక్క ఆసుపత్రిలోనూ రెగ్యూలర్ వైద్యుడు పనిచేయడం లేదు. ఉట్నూర్ ఆసుపత్రిలో పనిచేసే కొంతమంది వైద్యులు రిమ్స్ ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తుండగా శ్యాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఓ వైద్యుడు కూడా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇద్దరు చొప్పున 24గంటల పాటు వైద్య సేవలు అందించాల్సి ఉండగా.. జిల్లాలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఉన్న కాస్త వైద్యులు కూడా అడపాదడపా విధులకు హాజరవుతూ ఎగనామం పెట్టడంతో గిరిజనులు నాటు వైద్యాన్నే నమ్ముకుంటున్నారు. జిల్లాలో మరెన్నో గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు మార్గాలు లేక, ఆపద సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.

వైద్యుల నియామకానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం: రాథోడ్ జైసింగ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యుల నియమకానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రధానంగా కార్డియాలజిస్టుల కొరత ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న వైద్యులను సంప్రదిస్తూ జిల్లాకు రావాలని కోరుతున్నాం. ప్రభుత్వం తరపున అందాల్సిన వసతులన్ని ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోనే కాకుండా

మహారాష్ట్రలోని ప్రముఖ పట్టణాలలో పని చేసే వైద్యులను కూడా సంప్రదిస్తున్నాం. త్వరలోనే పూర్తిస్థాయిలో వైద్య పోస్టులను భర్తీ చేసి మెరుగైన వైద్య సేవలను అందిస్తాం. తక్కువ వేతనం కారణంగానే జిల్లాకు వచ్చేందుకు వైద్యులు ఆసక్తి చూపడం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎక్కువ వేతనమైనా చెల్లించి వైద్య పోస్టులను భర్తీ చేస్తాం.

ఇదీ మంత్రి పర్యటన షెడ్యూల్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు గురువారం జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. మధ్యాహ్నం 3.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. అలాగే రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో రేడియాలజీ ల్యాబ్, నర్సింగ్ కాలేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వైద్య అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. రాత్రి ఆదిలాబాద్ పట్టణంలో బస చేస్తారు.

## బడ్జెట్ ఆమోదం..!



మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో అధికారులు ప్రతిపాదించిన రూ.30.58 కోట్ల అంచనా బడ్జెట్‌ను పురపాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఛైర్మన్ పి.రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో పురపాలిక సంఘంలోని ఆయా విభాగాలకు కేటాయించిన నిధుల వివరాలను కమిషనర్ ప్రసన్నరాణి పద్దులవారీగా బడ్జెట్‌ను చదివి వినిపించారు. అధికారులు ప్రతిపాదించిన బడ్జెట్‌ను ఎలాంటి సవరణలు లేకుండా యథావిధిగా ఆమోదిస్తూనే ఆదాయ, వ్యయం వనరుల పెంపుపై సభ్యులు పలు సూచనలు చేశారు.

ఆదాయ వనరుల పెంపునకు కృషి చేయాలి..

సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టి సారిస్తూనే ఆదాయ వనరులను పెంచుకునేందుకు అధికారులు కృషి చేయాలని ఇందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక కోరారు. బుధవారం నిర్వహించిన మహబూబాబాద్ పురపాలక సంఘం బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ కె.శశాంక మాట్లాడారు. ఆదాయాన్ని పెంచుకోవడానికి వనరులను గుర్తించి సమావేశంలో చర్చలు చేసి తీర్మానం చేయాలన్నారు. వాణిజ్య సముదాయాలు, ప్రకటనల ద్వారా ఆదాయాన్ని రాబట్టాలన్నారు. పన్నుల విధింపులో పారదర్శకత పాటిస్తూ నిబంధనల మేరకు వివిధ రుసుములను నిర్ణయించి వసూలు చేసుకోవాలని సూచించారు. లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి సారించి నూతన నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తనవంతుగా పూర్తి సహకారం అందిస్తానన్నారు. బాహ్యావలయ, జాతీయ రహదారులు ఏర్పాటు అవుతన్నందున పట్టణ అభివృద్ధికి కావాల్సిన నిధులపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున నివేదికలను సిద్ధం చేయాలన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు తీసుకున్నారని వాటిని క్రమబద్ధీకరిస్తే ఆదాయం పెరుగుతుందని సీపీఎం ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య సూచించారు. 58, 59 జీవోతో పాటు ప్రస్తుతం జారీ చేసిన 14 జీవోను అమలు చేసేందుకు ప్రస్తుతం ప్రభుత్వ స్థలాల్లో ఎంత మంది ఉంటున్నారో వారందరి స్థలాలను క్రమబద్ధీకరిస్తూ ఇంటి నెంబర్లు కేటాయించాలన్నారు.

సీపీఐ ఫ్లోర్‌లీడర్ అజయసారథి మాట్లాడుతూ వాణిజ్య సముదాయాల నుంచి రుసుము వసూలు చేయాలన్నారు. తెరాస వార్డు కౌన్సిలర్ మార్నేని వెంకన్న మాట్లాడుతూ పేరు మార్పిడి ఫీజు రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి వెళుతుందని పురపాలక సంఘంలో జమ చేయాలన్నారు. తొలిసారిగా పురపాలక సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ రవీందర్‌రావును, కలెక్టర్ శశాంకను పాలకవర్గ సభ్యులు సన్మానించారు. జిల్లా అదనపు కలెక్టర్ అభిలాషఅభినవ్, వైస్‌ఛైర్మన్ ఎండీ ఫరీద్, కాంగ్రెస్, తెరాస ఫ్లోర్‌లీడర్లు వెన్నం లక్ష్మారెడ్డి, చిట్యాల జనార్ధన్, మేనేజర్ శ్రీధర్, టీపీవో నవీన్, ఏఈ సురేష్, పాల్గొన్నారు.

## బీమా.. ధీమా..!

ఆదిలాబాద్ : ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం.. ఒకే కుటుంబం.. అనే నినాదాన్ని నిజం చేస్తోంది సింగరేణి యాజమాన్యం. సంస్థలోని ఉద్యోగుల సంక్షేమంతో పాటు ఆర్థిక ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తోంది. ఎస్‌బీఐ ఖాతాదారులైన ఉద్యోగులందరికీ రూ.40 లక్షల ప్రమాద బీమా వర్తించేలా భారీ ఒప్పందం చేసుకుంది. సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు సంచాలకుడు ఎన్.బలరాం ఎస్‌బీఐ చీఫ్ అమిత్ జింగ్రాన్ సమక్షంలో ఇటీవలే ఈ ఒప్పందం చేసుకోగా.. ఈ నెల 4 నుంచి అమల్లోకి రానుంది.

ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం

సింగరేణి ఉద్యోగుల్లో ఎక్కువ మంది ఎస్‌బీఐ ఖాతాదారులే. యాజమాన్యం, ఎస్‌బీఐ మధ్య చాలా ఏళ్లుగా వేల కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ఉద్యోగుల ఖాతాలన్నింటినీ కార్పొరేట్ శాలరీ అకౌంట్లుగా మార్చి ప్రమాద బీమా వర్తించేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో సంస్థలోని సుమారు 35 వేలకు పైగా కార్మికులకు రూ.40 లక్షలు బీమా ప్రయోజనం చేకూరుతుంది. సింగరేణి విశ్రాంత కార్మికులకూ ఈ ప్రయోజనం కల్పించేలా యాజమాన్యం కృషి చేస్తోంది.

వేతన పరిమితితో సంబంధం లేకుండా..



యాజమాన్యం, బ్యాంకు అధికారులకు కుదిరిన ఒప్పందం ప్రకారం వేతన పరిమితితో సంబంధం లేకుండా అందరికీ ఒకే మొత్తంలో బీమా ప్రయోజనం అందనుంది. ఇదివరకు రూ.25 వేల నెల వేతన పరిమితి ఉంటే సిల్వర్, రూ.50 వేలు గోల్డ్, రూ.లక్షలోపు డైమండ్, రూ.లక్షపైన ప్లాటినమ్ కేటగిరిగా ఉండేది. వీటి ఆధారంగా కార్మికులకు రూ.10 లక్షలు నుంచి రూ.20 లక్షలు బీమా చెల్లించే వారు. ఇకపై ఉద్యోగులైన ఖాతారులందరికీ రూ.40 లక్షల బీమా అందుతుంది. ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.40 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.20 లక్షల బీమా ప్రయోజనం చెల్లిస్తారు.

ఒప్పందంతో ఆర్థిక ప్రయోజనం- కె.వెంకటేశ్, మెకానికల్ ఫోర్‌మెన్

ప్రమాద బీమాపై యాజమాన్యం చేసుకున్న ఒప్పందంతో ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుంది. దీనిలో డీడీలకు, ఏటీఎం, పాసు పుస్తకంపైన చేసే లావాదేవీలకు ప్రస్తుత ఛార్జీలను ఎత్తివేయడం హర్షణీయం. ఏటీఎం విత్ డ్రాయల్ పరిమితిని రూ.లక్షకు పెంచడం, ఇతర ఏటీఎంలతో ఉచిత విత్‌డ్రాయల్, ఉచిత ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర రాయితీలతో ఉద్యోగులందరికీ ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.

## పఠన సామర్థ్యం అంతంతే

పెద్దపల్లి : విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించేందుకు విద్యాశాఖ రూపొందించిన రీడ్(రీడ్ ఎంజాయ్ అండ్ డెవలప్) కార్యక్రమంలో అక్షర ప్రగతి తడబడింది. 8, 9 తరగతుల విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకబడినట్లు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ బృందం పరిశీలనలో స్పష్టమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల పాటు నిర్వహించే 'రీడ్' కార్యక్రమం 5న ప్రారంభమైంది. కొవిడ్ కారణంగా రెండేళ్లుగా ప్రత్యక్ష బోధనకు దూరం కావడంతో విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు లోపించినట్లు తేలింది. విద్యార్థి ఎంతవరకు చదువుతున్నారు? రాయగలుతున్నారు? అని తనిఖీ బృందాలు నిశితంగా పరిశీలించగా ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. విద్యార్థులు కథలు, విజ్ఞాన సంబంధిత తదితర పుస్తకాలతో సాధన చేస్తుండగా చాలా చోట్ల పుస్తకాల కొరత వెంటాడుతోంది. గ్రంథాలయానికి ప్రత్యేక గది లేకపోవడంతో తరగతి గదిలోనే చదువుకుంటున్నారు. పుస్తకాలు, మౌలిక వసతులు సమకూరిస్తే విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుంది.

వ్యసనంగా మారిన చరవాణి

కొవిడ్ నేపథ్యంలో వరుసగా రెండేళ్లు టీశాట్, చరవాణుల సహకారంతో



పాఠాలు బోధించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో పాఠాల కంటే వీడియోగేమ్‌లు, యూట్యూబ్ ఛానళ్లల్లో ప్రసారమవుతున్న కార్యక్రమాలను వీక్షించినట్లు తేటతెల్లమవుతోంది. విద్యార్థులు ఇంట్లో అత్యధిక సమయాన్ని చరవాణులకు కేటాయించడంతో పాఠాలు చెవికెక్కడం లేదని పర్యవేక్షణ బృందం సభ్యులు చెబుతున్నారు. తద్వారా పుస్తక పఠనంపై అనాసక్తి చూపుతున్నట్లు పేర్కొంటున్నారు. విద్యార్థుల అక్షర సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, వారిలో ఆలోచించే ప్రయత్నం చేస్తున్నారు.

ఆసక్తి ఉన్నా పుస్తకాలేవీ! ప్రతి విద్యార్థికి విజ్ఞానాన్ని అందించేందుకు రీడ్(చదువు, ఆనందించు, అభివృద్ధి చెందు) నినాదంతో మూడు అంశాలను లక్ష్యాలుగా నిర్దేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1-8వ తరగతి విద్యార్థులు సాధనలో పాల్గొంటున్నారు. పఠనం అలవాటు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుంటున్నారు. విద్యార్థిని చదివిస్తూ, సొంతంగా కథలు, వ్యాసాలు రాసేలా ప్రోత్సహిస్తున్నారు. జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో సమగ్రశిక్ష జిల్లా సమన్వయకర్తతో పాటు ఏడుగురు సీనియర్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు పాఠశాలలను సందర్శించి లోపాలను సరిదిద్దుతున్నారు. ఆంగ్ల, హిందీ భాషలకు సంబంధించి కథలు, ఆలోచన శక్తి పెంచే పుస్తకాలు అందుబాటులో లేవు. గదులు లేక వరండా, ఆరుబయట సాధన చేసే పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు నిధులు విడుదల కావడం లేదు.

# నత్తనడకన చెక్‌డ్యాంల నిర్మాణం

హుజూరాబాద్: వరదను ఒడిసిపట్టేందుకు వీలుగా నిర్మిస్తున్న చెక్‌డ్యాంల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. కొరవడిన అధికారుల పర్యవేక్షణ, గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల ఆగుతూ.. సాగుతూ.. పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లు దాటినా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ఇటీవల ఈఎన్‌సీ(జనరల్) మురళీధర్‌రావు చెక్‌డ్యాంల పరిస్థితిపై నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. మే 31లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతోనైనా చెక్‌డ్యాంల పనులు గడువులోగా పూర్తవుతాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

రూ.174 కోట్లు.. 28 చెక్‌డ్యాంలు

జిల్లాలోని మానేరు వాగు, ఇతర వాగులపై రూ.174 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 28 చెక్‌డ్యాంల పనులు రెండేళ్లు దాటినా పూర్తి కావడం లేదు. 2020లో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి-2021లోనే పూర్తి చేయాల్సి ఉన్నా జాప్యం జరిగింది. మరోరెండుసార్లు గడువు పొడిగించినా అదే నిర్లక్ష్యం. 31.05.2022లోగా పనులు పూర్తయ్యేలా ఈఎన్‌సీ అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించినప్పటికీ ఇంతవరకు కనీసం ఒక్కటి కూడా పూర్తికాలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇదీ పరిస్థితి

కరీంనగర్ వంతెన, చేగుర్తి, బొమ్మకల్-1, బొమ్మకల్-2లోని మానేరు వాగుపై రూ.77.24 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అయిదు చెక్‌డ్యాంలు 70 శాతానికి మించి పూర్తి కాలేదు. కేశవపట్నం, గద్దపాక, ఆర్కండ్ల వాగులపై రూ.8.70 కోట్లతో చేపడుతున్న మూడు చెక్‌డ్యాంలు 55 శాతం నుంచి 70 శాతం మధ్య పనులే పూర్తయ్యాయి. ఆర్కండ్ల చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోయింది. లింగాపూర్, వేగురుపల్లిలోని మానేరు వాగుపై రూ.39.48 కోట్లతో నిర్మించే రెండు చెక్‌డ్యాంలు 65 శాతం నుంచి 75 శాతం పూర్తయ్యాయి. ముగ్దంపుర ఇరుకుల్ల వాగుపై రూ.6.32 కోట్లు, నల్లగుంటపల్లిలోని ఇరుకుల్లవాగు, గోపాల్‌పూర్ నగునూరు వాగుపై రూ.16 కోట్లతో నిర్మిస్తున్న మూడు చెక్‌డ్యాంల పనులు ఇటీవలే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి కల్వల వాగుపై రూ.4.70 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులు రెండేళ్లు దాటినా 66 శాతమే పూర్తయ్యాయి. బ్రాహ్మణపల్లి కల్వల వాగుపై రూ.3.36 కోట్లతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం 70 శాతమే పూర్తయింది. ఇల్లందకుంట మండలం వాగొడ్డు రామన్నపల్లి, మల్యాల-1, మల్యాల-2, పాతర్లపల్లి-1, పాతర్లపల్లి-2, జమ్మికుంట మండలంలోని మడిపల్లి వాగులపై రూ.7.52 కోట్లతో ఆరు చెక్‌డ్యాంల పనులు 80 శాతానికి మించలేదు. కమలాపూర్ మండలం నేరెళ్ల, శనిగరం, గూడూరు వాగులపై రూ.12.04 కోట్లతో నిర్మించే నాలుగు చెక్‌డ్యాంలు 90 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. హుజూరాబాద్ మండలంలో నాలుగు చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.4.31 కోట్లు మంజూరవగా జూపాకలో పనులు నిలిచిపోయాయి. కనుకులగిద్దలో పనులను రద్దు చేశారు. రాంపూర్‌లో కేవలం 40 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి.

దెబ్బతిన్న వాటికి మరమ్మతులేవి? 2020లో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల చెక్‌డ్యాంలు దెబ్బతిన్నాయి. తిరిగి పనులు చేయాలంటే ఒప్పందంలోని నిధుల కంటే రెట్టింపు అవుతుందని, తాము నష్టపోతామంటూ గుత్తేదారులు చేతులెత్తేశారు. లస్మక్కపల్లి వాగుపై చెక్‌డ్యామ్ సీసీ, అఫ్రాన్ పూర్తిగా ధ్వంసమైంది. రామకృష్ణాపూర్‌లో వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ కట్ట వరదలకు తెగి ఫ్లడ్‌బ్యాంకు దెబ్బతింది. పోతిరెడ్డిపల్లి వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ సీసీ వరదల వల్ల పూర్తిగా దెబ్బతింది. మత్రిపల్లిగూడెంలో నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఫ్లడ్‌బ్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో 12 గజాల లోతుకు కోతకు గురైంది. గోపాలపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యామ్ ఫ్లడ్‌బ్యాంకు, సీసీ పూర్తి దెబ్బతింది. నేరెళ్లలో నిర్మించిన చెక్‌డ్యామ్ వరదలకు పూర్తిగా దెబ్బతింది. బాడివాల్, అఫ్రాన్ బీములు, అపార్ట్‌మెంట్ రింగ్స్, సీసీ కొట్టుకుపోయాయి.

మే నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు- శివకుమార్, ఎస్ఈ, నీటిపారుదల శాఖ

ఈఎన్‌సీ ఆదేశాలతో చెక్‌డ్యాంల నిర్మాణ పనులను మే నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు చేపడతాం. జిల్లాలోని చెక్‌డ్యాంల పనులు ఏ దశలో ఉన్నాయో నివేదికలు తెప్పించాం. దాదాపు అన్నీ 90 శాతం మేరకు పనులు పూర్తయ్యాయి. గడువులోగా పనులు చేయని గుత్తేదారులకు నోటీసులు జారీ చేస్తాం. వరదలకు దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేయాల్సిన బాధ్యత గుత్తేదారులదే.

# ప్రకృతి కలవరం.. వాతావరణం

జగిత్యాల : నిరుడు వేసవిలో రాష్ట్రస్థాయి అత్యధిక ఉష్ణోగ్రత నమోదు ప్రాంతాల్లో జగిత్యాల సహా ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలే ఎక్కువగా ఉండటం, గత వానాకాలంలోనూ సాధారణం కన్నా 41 శాతం అధిక వర్షపాతం నమోదు కావటం, చలికాలంలోనూ పెద్దగా ఉక్కబోత వాతావరణం నెలకొనటం తదితరాలు ఇక్కడి వాతావరణ మార్పులకు అద్దం పడుతున్నాయి. వాతావరణ మార్పులు జనజీవితంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రంగమైన వ్యవసాయాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సాగుతో పాటు ఇతర రంగాలను విపత్తుల నుంచి తప్పించేలా మార్చి 23న ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ సంవత్సరం 'ది ఫ్యూచర్ ఆఫ్ వెదర్, క్లైమేట్ అండ్ వాటర్ అక్రాస్ జెనరేషన్' థీమ్(నినాదం) పేరిట కార్యక్రమాలను నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్దేశించింది. ఐరాస సభ్యదేశాలు 1950 నుంచి మార్చి 23న ప్రపంచ వాతావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తుండగా 1961 నుంచి ఏటా ఒక నినాదంలో వాతావరణ సదస్సులు, సాంకేతికత బదలాయింపు, మానవాళికి సూచనలు, శాస్త్రవేత్తల పరిశోధనలకు మార్గనిర్దేశనం చేస్తున్నారు.

ఇటీవల క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి తక్కువ సమయంలోనే కుంభవృష్టి కురియటం, పిడుగులు, రాళ్లవానలు తదితరాలు సంభవిస్తున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గటం, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్‌కు పెరగటం విపత్తులకు దారితీస్తుండగా వాతావరణ సమతుల్యతకు అడవుల పెంపు, కాలుష్య నివారణ తదితరాలను అందరూ బాధ్యతగా తీసుకోవాల్సిఉంది. సాధారణ పరిస్థితుల్లో వానాకాలంలో 12.50 లక్షల ఎకరాల్లో, యాసంగిలో 10.35 లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలను, 1.95 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. వాతావరణ మార్పులతో అన్నిపంటల్లోనూ దాదాపుగా 14-40 శాతం వరకు దిగుబడులు ప్రభావితమవుతుండగా సకాలంలో గుర్తించి సవరణ చర్యలను తీసుకుంటేనే పంటనష్టాన్ని తగ్గించుకోవచ్చు. వాతావరణ మార్పులతో అన్ని పంటల్లోనూ చీడపీడల తీవ్రత పెరగటం, పోషకలోపాలు తలెత్తటం సహజంగా ఉంటుండగా కర్షకులు వీటిని అధిగమించాలి. పుణె, హైదరాబాద్ వాతావరణ అధ్యయన కేంద్రాల ఆధ్వర్యంలో జగిత్యాల పొలాస పరిశోధనస్థానంలోని వాతావరణ కేంద్రం ద్వారా శాస్త్రవేత్తలు వాతావరణ పరిస్థితులను నమోదుచేస్తూ 15 జిల్లాల్లోని ఏరువాక కేంద్రాలు, వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతివారం రెండుసార్లు రైతులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు.

# ఏళ్లుగా నిర్మాణంలోనే..



ములుగు : పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజన జరిగింది. ప్రజలకు కిలోమీటర్ల వ్యయ ప్రయాసలు తగ్గాయి. పాలనాధికారి, ఇతర యంత్రాంగం అందుబాటులో ఉండేందుకు ఆయా జిల్లా కేంద్రాల్లో సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నిర్మించాలని నిర్ణయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనూ సమీకృత భవనాన్ని నిర్మించేందుకు మంజూర్‌నగర్‌లో శంకుస్థాపన చేశారు. ఆ భవనం నిర్మాణం ఏళ్లుగా సాగుతూనే ఉంది. ఇప్పటికీ పూర్తికాలేదు.

అంతంత మాత్రంగానే..

సమీకృత పరిపాలనా భవనానికి జిల్లా కేంద్రంలో 2017 అక్టోబర్ 11న పట్టణంలోని మంజూర్‌నగర్‌లో పనులకు శంకుస్థాపన చేశారు. ఆరేళ్లవుతున్నా.. భవన నిర్మాణం మాత్రం పూర్తికాలేదు. శంకుస్థాపన చేసిన ఆరునెలల తర్వాత పనులు ప్రారంభించి కోర్టు సమస్యల వల్ల పనులు నిలిపివేశారు. రేండేళ్ల తర్వాత ఇటీవలే పనులు ప్రారంభించినా.. అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పనులకోసం గడువు పెంచుతూ వస్తున్నారు.

అన్నీ ఒకేచోట ఉంటే..

యంత్రాంగం అంతా ఒకేచోట ఉంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి. అన్నిశాఖల అధికారులు ఒకే సముదాయంలో ఉంటారు. ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది. విధి నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ఉన్నతాధికారులు, పాలనాధికారి పర్యవేక్షణ ఉంటుంది. మరింత మెరుగైన సేవలు అందేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉండే కార్యాలయాల నుంచి కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీంతో రాకపోకలకు సమయం వృథా అవుతోంది. ఒకేచోట అన్నీ కార్యాలయాలు ఉంటే జిల్లా అధికారులు అందుబాటులో ఉండి, సకాలంలో సమావేశాలు జరుగుతాయి. అవసరమైన నివేదికలు కూడా అందుబాటులో ఉంటాయి.

పర్యవేక్షణ కరవు

ప్రస్తుత సింగరేణి సంస్థ భవనంలో కొనసాగుతున్న కలక్టరేట్లోని సెక్షన్ కార్యాలయాలు, కలెక్టర్, జేసీ, అదనపు కలెక్టర్, సీపీవో, డీకేఐసీ, భూగర్భ జలాలు, పౌరసరఫరాలు, పౌరసంబంధాలు, డీపీవో, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ అభివృద్ధి తదితర కార్యాలయాలున్నాయి. ప్రగతి భవన్‌లో పది ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. జిల్లా పరిశ్రమలు, పశు సంవర్ధకం, ఖజానా, గ్రామీణాభివృద్ధి, సహకార అధికారి, సంక్షేమ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, గనులు, భూగర్భ, జిల్లా సహాయక సంచాలకులు, లీడ్ బ్యాంకు తదితర కార్యాలయాలు ఏర్పాటు చేశారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలోని భవనంలో ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, పే అండ్ అకౌంట్స్, ఉపాధికల్పన, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ తదితర కార్యాలయాలున్నాయి. పలు ప్రాంతాల్లో కార్యాలయాలు ఉండటంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా పోతోంది.

గదుల కొరత

గదులు సరిపోక కలెక్టరేట్లో జిల్లా మహిళా శక్తి కేంద్రాన్ని క్యాబిన్‌లో నిర్వహిస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం కలెక్టరేట్‌లోనే ఉండేది, గదుల కొరతతో మరో అద్దె భవనానికి మార్చారు. మిషన్ భగీరథ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, డీఆర్‌డీఏ తదితర కార్యాలయాల్లో గదుల కొరత వేదిస్తోంది. ప్రజావాణికి స్థలం సరిపోక సింగరేణి ఇల్లందు క్లబ్‌హౌస్‌లో నిర్వహిస్తున్నారు.

మూడు నెలల్లో అందుబాటులోరమేశ్, డీఈ ఆర్‌అండ్‌బీ

పనుల్లో వేగం పెంచాం. దాదాపు పనులు పూర్తికావస్తున్నాయి. మూడు నెలల్లో సమీకృత జిల్లా కార్యాలయాల భవనం అందుబాటులోకి వస్తుంది. ఆలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

# చిత్తశుద్ధి లేని బల్దియా




హుస్నాబాద్: అభివృద్ధి కార్యక్రమాలు సమయానికి పూర్తవ్వాలంటే నిధులు అవసరం. హుస్నాబాద్ బల్దియాలో ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు మెండుగా ఉన్నా పాలకవర్గం పట్టించుకోవటం లేదు. ప్రభుత్వ పరంగా వచ్చే వివిధ గ్రాంట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పుర సాధారణ నిధి నుంచి పారిశుద్ధ్య ఉద్యోగుల వేతనాలు, వీధి దీపాలు, నీటి సరఫరా నిర్వహణ, విద్యుత్తు బిల్లులకు సరిపోవడం లేదు. ఒక్కోసారి వేతనాలు ఇవ్వడానికి సాధారణ నిధిలో సరైన నిల్వలు లేక ఇతర గ్రాంట్ల నుంచి మళ్లిస్తున్నారు. ఆస్తి పన్నులు, వ్యాపార లైసెన్సులు, ఇంటి నిర్మాణ అనుమతి రుసుములు, అంగడి వేలం తదితరాల ద్వారా ఏటా రూ.2.50 కోట్ల ఆదాయం వస్తోంది. పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే రూ.3 కోట్లకుపైగా చేరుకునే అవకాశం ఉంది. కొందరు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నా ఆస్తి పన్ను విధింపు ప్రారంభం కాలేదు. వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పట్టణంలో దాదాపు 800 పైగా వ్యాపార దుకాణాలు ఉన్నాయి. వాటిలో యాభై శాతానికి పైగా వృత్తి వ్యాపార లైసెన్సులు లేవు. కేవలం బ్యాంకు రుణాలు, ఇతర వాణిజ్య పన్నుల ధ్రువీకరణ పత్రాలు పొందడానికి అవసరం ఉన్న వారే లైసెన్సులు తీసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా ప్రచార బోర్డులు

గత రెండేళ్లుగా పురపాలిక పరిధిలో వివిధ రకాల షాపింగ్ మాల్స్, దుస్తుల దుకాణాలు, రెస్టారెంట్లు, బేకరీలు, ఆటోమొబైల్స్ ఏర్పాటు అయ్యాయి. వాస్తవానికి పురపాలిక నుంచి ట్రేడ్ లైసెన్సు పొందిన తర్వాతనే ప్రారంభించాలి. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడం లేదు. పట్టణంలో మాంసం, చికెన్ సెంటర్లు దాదాపు 80 ఉన్నాయి. ఇందులో 70 శాతం వాటికి అనుమతుల్లేవు. అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మాంసం దుకాణాల నుంచి ప్రతిరోజు పశు వధశాల రుసుము వసూలు చేయాలి. పశువధశాల ఏర్పాటు చేయడంలో పాలకవర్గం నిర్లక్ష్యం వహిస్తోంది. పురపాలికకు ఆదాయంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మాంసం లభించే అవకాశం ఉంది. ఇటీవల ప్రతి శుక్రవారం జరిగే అంగడి వేలం రూ.కోటి వరకు రావాల్సి ఉండగా రూ.80 లక్షలకే పరిమితమైంది. వేలంలో పోటీ పెరిగితే మరో రూ.20 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పట్టణంలో హోర్డింగులు, డివైడర్లపై ఉండే స్తంభాలు ప్రచార బోర్డులపై అన్నిటికీ రుసుము వసూలు చేయాల్సి ఉంది. ఇష్టారాజ్యంగా ఏర్పాటవుతున్నాయి. ఇళ్ల స్థలాలకు సంబంధించి ఖాళీగా ఉన్నవాటిపై సెస్సు వసూలు చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు. రెండేళ్ల క్రితం పలు చోట్ల ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగగా తొలగించారు. సెల్ టవర్లకు సంబంధించి రుసుము వసూలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 25 పైగా టవర్లు ఉన్నాయి. పలు ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తే పురపాలికకు మరో రూ.50 లక్షలకు పైగా ఆదాయం చేకూరనుంది.

దృష్టి పెట్టి, తాఖీదులిస్తాం: - రాజమల్లయ్య, కమిషనర్, పురపాలక సంఘం, హుస్నాబాద్వివిధ రకాల లైసెన్సుల జారీ, రుసుము వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ట్రేడ్ లైసెన్సుల జారీకి కొత్త విధానం వచ్చింది. విస్తీర్ణాన్ని బట్టి నిర్ణయిస్తాం. టవర్లకు సంబంధించి తాఖీదులు జారీ చేస్తాం. బల్దియా ఆదాయాన్ని మరింత సమకూర్చుకొని అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తాం.

# నాబార్డు రుణప్రణాళిక ఖరారు

జగిత్యాల : జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డు) ద్వారా జగిత్యాల జిల్లాలో 2023-24 సంవత్సరంలో అమలుచేసే వార్షిక రుణప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. జిల్లాకు 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.3,566 కోట్లను, 2022-23లో రూ.4,470 కోట్లను ఇవ్వగా ఈ సంవత్సరం రూ.4,948 కోట్లను కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక భాగంగా వానాకాలం, యాసంగిల్లో రైతులకు పంటరుణాలు, అనుబంధ టర్మ్‌రుణాలుగా ఇవ్వనున్నారు. భూముల అభివృద్ధి, నీటిపారుదల సౌకర్యాల కల్పన, యంత్రాల కొనుగోలు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన, పాడిగేదెలు, కోళ్లు, గొర్రెలు, మేకలు, చేపల పెంపకానికి కూడా రాయితీలతో కూడిన రుణాలను అందించనున్నారు. పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సాయం అందించనున్నారు. వ్యవసాయరంగం తదుపరి మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు, గృహాలు, విద్యారుణాలు, సంప్రదాయేతర ఇంధన వనరులు, ఇతర సామాజిక వనరుల కల్పనకు నిధులను కేటాయించారు.

# బయటకు రావాలంటే హడల్..!

రామగుండం : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గ్రామ సింహాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లలోంచి బయటకు రావాంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి రోజు నగరంలోని వివిధ కాలనీల్లో ఎక్కడో ఒకచోట కుక్కల బారిన పడి ప్రజలు గాయాలపాలవుతున్నారు. గతంలో వీటిబారిన పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. రామగుండం ప్రాంతంలో కుక్కలు దాడిచేసిన సమయంలో స్థానికులు సకాలంలో స్పందించడంతో ఎంతోమంది చిన్నారులు ప్రాణాలతో బయట పడగలుగుతున్నారు. లేదంటే హైదరాబాద్ సమీపంలో చోటుచేసుకున్న సంఘటనలు స్థానికంగా చోటు చేసుకుంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీధికుక్కల నియంత్రణపై నగరపాలిక దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుక్కల బారిన పడి తీవ్ర గాయాలపాలై చికిత్స కోసం నిత్యం గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నగరంలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ నిత్యం కుక్కకాటు బాధితులు చికిత్స కోసం క్యూ కడుతున్నారు.

శస్త్రచికిత్సల కేంద్రం వృథా

ఏడాది క్రితం వరకు నగరంలోని కుక్కలను పట్టి దూరంగా వదిలేయడంతో పాటు కొన్నింటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించేందుకు సుమారుగా రూ.65 లక్షలు ఖర్చు చేసిన నగరపాలిక ప్రస్తుతం కుక్కల తీవ్రత పెరిగినప్పటికీ నివారణ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2,258 కుక్కలను నగరానికి దూరంగా తరలించినందుకు రూ.27 లక్షలు, 3,188 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించినందుకు రూ.38 లక్షలు వెచ్చించారు. కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించేందుకు మల్కాపూర్‌లో మురుగు జలాల శుద్ధి కేంద్రం సమీపంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేంద్రం వృథాగా ఉంది. వీధి కుక్కలను తరలించేందుకు ఒక్కోదానికి రూ.750 చెల్లించేందుకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసినా ఆచరణకు నోచుకోవడం లేదు. నిత్యం ఎక్కడో ఒక చోట..

నగరంలోని ఏ వీధిలో చూసినా గుంపులు, గుంపులుగా తిరిగే శునకాలతో భయం భయంగానే బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఒంటరిగా పాఠశాలలకు వెళ్లేందుకు, బయట ఆడుకునేందుకు జంకుతున్నారు. మారుతినగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేళ్ల బాలుడిపై కుక్కలు ఇటీవల దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. అతని అరుపులతో పరిసరాల్లోని వారు బయటకు వచ్చి కుక్కలను తరమడంతో బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఇలాంటి సంఘటనలు నిత్యం ఏదో ఒక కాలనీలో చోటుచేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని నెలల క్రితం నర్రశాలపల్లికి చెందిన వృద్ధురాలిపై శునకాలు దాడి చేయడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందింది. లాల్‌బహదూర్‌నగర్‌లో ఓ హమాలీ కార్మికుడు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా కుక్కలు వెంబడించడంతో అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి వేళల్లో విధుల్లోకి వెళ్లే సింగరేణి కార్మికులు విఠల్‌నగర్, తిలక్‌నగర్, ఫైవింక్లయిన్ కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు.

సత్వరమే చర్యలు చేపట్టాలి-పి.అరుణ్‌కుమార్, రమేశ్‌నగర్

కుక్కల బెడద నివారణకు నగరపాలిక సత్వరమే చర్యలు తీసుకోవాలి. నిత్యం కార్మికులు, విద్యార్థులు వీటిబారిన పడుతూ గాయాలపాలవుతున్నారు. రాత్రివేళల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. నగర పాలకవర్గం, అధికారులు స్పందించి స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలి.

త్వరలో పరిష్కారం -బి.సుమన్‌రావు, నగరపాలక కమిషనర్

వీధికుక్కల సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటాం. రోజురోజుకూ కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయి. ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. కుక్కలను పట్టుకొని నగరానికి దూరంగా వదిలేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వాటిని పట్టుకునే బృందం ప్రస్తుతం వేరే ప్రాంతంలో ఉంది. కొద్ది రోజుల్లో వారు రామగుండంలో కుక్కలను పట్టే పనిలో నిమగ్నం కానున్నారు.

# మార్చి ముందర.. పనుల తొందర

కరీంనగర్ : కరీంనగర్ నుంచి సదాశివపల్లికి వెళ్లే తీగల వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనుల్లో వేగాన్ని పెంచుతున్నారు. రూ.224 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇక్కడి పురోగతిని ర.భ.శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మూడేళ్లుగా కొనసాగుతున్న ఈ వంతెనను ఈ నెలఖరులోగా పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నిధుల లేమితోపాటు ఇతరత్రా ఇబ్బందులు వెంటాడినా.. నిర్మాణాన్ని తుది దశకు తీసుకొచ్చారు. వచ్చే నెల 14న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా వంతెనను ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు. మరో 9 రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో జిల్లా వ్యాప్తంగా ఈ వారంలో వివిధ శాఖల పర్యవేక్షణలో సాగుతున్న ప్రగతి పనుల్లో జోరు పెరగనుంది. గడిచిన మూడు, నాలుగు నెలల నుంచి మార్చి 31 తుది గడువుగా నిర్ణయిస్తూ వేగాన్ని పెంచుతూ వస్తున్నారు. జిల్లా పాలనాధికారి ఆయా విభాగాల ఉన్నతాధికారుల సమావేశంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 2022-23 వార్షిక సంవత్సరం ముగుస్తున్నందున పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తిచేయాలనే హుకుం జారీ చేశారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు ఉన్నపళంగా కొసరు పనులను పూర్తిచేసే పనిలో బిజీ అయ్యారు. ముఖ్యంగా ర.భ.శాఖతోపాటు పంచాయతీరాజ్ అధికారులు ఈ విషయంలో దూకుడును చూపుతున్నారు.

కొన్నింటే పురోగతి..! ర.భ.శాఖ జిల్లాలో కీలకమైన రహదారులతోపాటు కరీంనగర్ పట్టణంలో ముఖ్యమైన భవనాలను నిర్మించే బాధ్యతను భుజానకెత్తుకుంది. వీటితోపాటు రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం చేపడుతోంది. జిల్లా కేంద్రంలో రూ.51 కోట్లతో నూతన కలెక్టరేట్ నిర్మాణం తీరుని ఈ శాఖ పర్యవేక్షిస్తోంది. కొత్త కలెక్టరేట్ నిర్మాణం దాదాపుగా 50 శాతం పూర్తయ్యింది. కరీంనగర్‌లో రూ.కోటితో నిర్మిస్తున్న శాసన సభ్యుడి నివాస కార్యాలయం పనులు దాదాపుగా ఈ నెలాఖరుతో పూర్తవుతాయి. షాదీఖానా, అంబేడ్కర్ భవనాలు మాత్రం నిర్మాణ దశలోనే సా..గుతున్నాయి. జిల్లాలోని దారులపై 7 చోట్ల నిర్మిస్తున్న పెద్ద వంతెనలు దాదాపుగా పూర్తికావొచ్చాయి. కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఈ నెలాఖరులోగా 59 ముఖ్యమైన రోడ్లను తారుతో ఏర్పాటు చేయాలని భావించారు. ఇందులో 26 టెండర్ల దశలో ఉండగా.. 33 ప్రగతి దశలో ఉన్నాయి. కొన్నింటినైనా మార్చి చివరి వరకు పూర్తిచేయాలనే జోరుని చేతల్లో చూపిస్తున్నారు.

వీలైనన్ని పూర్తయ్యేలా..! పంచాయత్‌రాజ్ శాఖ పర్యవేక్షణలోనే జిల్లాలో ఎక్కువగా పనులు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 12,258 పనులకు సంబంధించి రూ.988.57 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి ఫలాలను పల్లెల్లో, పట్టణాల్లో అందించాలని భావించారు. ఇప్పటి వరకు రూ.382.31 కోట్ల వ్యయంతో 6,605 పనులు పూర్తయ్యాయి. మరో 1,200 పనులు ప్రగతి దశలో ఉన్నాయి. కనీసం 500 పనులు చివరి దశలో ఉన్నాయి. వీటిని ఎట్టిపరిస్థితుల్లో పూర్తిచేయించేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువగా దళిత వాడల్లో వేస్తున్న సీసీ రోడ్లు 148 వరకున్నాయి. గ్రామ పంచాయతీ భవనాలు చాలాచోట్ల నిర్మాణపు చివరి దశలో ఉన్నాయి. ఈ శాఖ పరిధిలో దాదాపుగా రూ.606.26 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. గుత్తేదారులు అనాసక్తి చూపిస్తుండటంతోపాటు చేసిన పనులకు సక్రమంగా బిల్లులు అందకపోవడంతో అసంపూర్తిగానే అభివృద్ధి అగుపిస్తోంది. చిన్నాచితకా పనులు కలిపి ఏకంగా 4,453 పనులు అసలు ప్రారంభించనేలేదు. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన సీసీ రోడ్లే 319 ఉండటం గమనార్హం.

# అక్రమాలకు సహకారం..?

కరీంనగర్ : ఇదీ.. కరీంనగర్ జిల్లాలోని గట్టుదుద్దెనపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్). ఒకప్పుడు రాష్ట్రస్థాయిలోనే ఆదర్శమనే పేరొందిన ఇక్కడి సొసైటీ గడిచిన రెండేళ్ల కిందట నిధుల దుర్వినియోగం సహా ఇతర అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంది. ఆడిట్ సహా ఇతర పరిశీలనల్లో రూ. 1.17కోట్ల మేర అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. పలుదఫాలుగా విచారణ చేసిన అధికారులు మొత్తంగా రూ. 48లక్షల నిధులు పక్కదారి పట్టాయని తేల్చారు. ఇటీవల కొన్ని రోజుల కిందట ఈ మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం కింద తిరిగి రాబట్టేందుకు సర్వీస్ ఆర్డర్‌ను జిల్లాధికారులు జారీ చేశారు. దీంతో అప్పట్లో బాధ్యులుగా తేలిన వారిపై చట్టరీత్యా చర్యలుండటంతోపాటు మెక్కిన సొమ్మును తిరిగి రాబట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని సహకార సంఘాలకు అవినీతి మకిలీ అంటుకుంటోంది. ప్రస్తుతం కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 10 పీఏసీఎస్‌లు అక్కడ జరిగిన అక్రమాలపై విచారణను ఎదుర్కొంటున్నాయి. అధికారికంగా నిగ్గుతేల్చిన మొత్తమే రూ. 1.40కోట్లుగా ఉంది. అన్నిచోట్ల సీఈవోలపై సస్పెన్షన్ వేటు పడింది. మెట్ల చిట్టాపూర్ సంఘం అక్రమాల విషయంలో అక్కడి అధికారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి బాధ్యతల నుంచి తొలగించారు. కరీంనగర్ జిల్లాలో జూపాక, గట్టుదుద్దెనపల్లి, దుర్శేడ్, పెద్దపల్లి జిల్లాలో మంథని, జగిత్యాల జిల్లాలో యామాపూర్, అయిలాపూర్, చిట్టాపూర్, సిరిపూర్, మెట్ల చిట్టాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొలనూర్ సహకార సంఘాలు ఈ వివాదాస్పదంలో భాగమయ్యాయి.

ప్రధాన ఆరోపణాలిలా..!

గ్రామాల్లో రైతులకు కొండంత అండగా నిలబడాల్సిన సహకార సొసైటీల్లో కొందరు చేతివాటాన్ని చూపిస్తూ ప్రజల సొమ్మును అప్పనంగా కాజేస్తున్నారు. ముఖ్యంగా రైతులకు అందించే రుణాలను తిరిగి జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకోవడం, సేద్యం కోసం అందించిన ఎరువుల్ని పక్కదారి పట్టించి ఆ సొమ్మును జేబుల్లో నింపుకోవడంలాంటి చర్యలకు కొందరు పాల్పడ్డారు. ఇక ధాన్యం కొనుగోలు విషయంలోనూ తప్పిదాలకు తావిచ్చారు. రైతులు జమ చేసుకున్న డిపాజిట్ డబ్బుల్ని కూడా ఒకటిరెండు చోట్ల కొల్లగొట్టారనే ఆరోపణలున్నాయి. డిపాజిట్లు లేకపోయినప్పటికీ అవి ఉన్నట్లుగా చూపి రుణాలిచ్చారనే విమర్శలు కొన్నిచోట్ల అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చాయి. ఆన్‌లైన్ విధానం 2016 నుంచి అమలులో ఉన్నప్పటికీ నిధుల్ని దుర్వినియోగం చేసే విషయంలో కొన్ని సంఘాలు తమ చతురతను చూపించాయి. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం, ఆడిట్ విషయంలోనూ సక్రమంగా లెక్కల్ని గుర్తించలేదనే అభియోగాలు సహకారశాఖ సిబ్బంది నుంచే వినిపిస్తుండటం గమనార్హం. ఇక చేసిన ఖర్చుకన్నా అధికంగా లెక్కల్ని రాసిన సందర్భాలున్నాయి.

ఆలస్యంగా తేరుకుంటూ..!

గడిచిన కొన్నేళ్లుగా సహకార సంఘాల్లో అవినీతి అక్రమాల జాడలు కనిపిస్తున్నా.. ఉన్నతాధికారులు తక్షణమే స్పందిస్తూ వీటిని అరికట్టే విషయంలో విపరీతమైన జాప్యమే జరుగుతోంది. పైగా ఒకసారి జరిగిన తప్పిదాన్ని గుర్తించి తిరిగి అలాంటి ఇబ్బంది తలెత్తకుండా అడ్డుకట్ట వేసే విషయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పైగా పాలకవర్గాల పర్యవేక్షణ కూడా నామమాత్రంగా ఉన్న చోట ఇలాంటి లొసుగులు బయపడుతున్నాయి. కొన్నిచోట్ల పాలకవర్గాలు చురుగ్గా వ్యవహరిస్తూ అక్రమాల గుట్టుని బయటపెడుతున్నాయి. ఇక కీలకమైన విచారణ సమయంలోనూ ఉన్నతాధికారులు నెలల తరబడి జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

# శిక్షణ సద్వినియోగం.. ఆదాయ మార్గం

గోదావరిఖని : మహిళలకు సింగరేణి సంస్థ చేయూతనిస్తోంది. కేవలం శిక్షణ ఇవ్వడమే కాదు మార్కెటింగ్ చేసుకునే అవకాశం సైతం కల్పిస్తోంది. ఇంటివద్ద కుట్లు...అల్లికలు..ఎంబ్రాయిడరీ పనులతో పాటు చేతి సంచులు, శారీ డిజైనింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్న సింగరేణి సేవాసమితి వాటిని అమ్ముకోవడానికి మార్గం చూపుతోంది. ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసుకునే సదుపాయం కల్పిస్తోంది. దీంతో సింగరేణి సేవా సమితి మహిళలు తయారు చేసిన వస్తువులను అమ్ముకొని ఆదాయం గడించే అవకాశం లభిస్తుంది. మహిళలకు ప్రతి సంవత్సరం ప్రతి డివిజన్ నుంచి ఐదుగురు సభ్యులకు అవకాశం కల్పిస్తుంది. అక్కడ 45 రోజుల పాటు ఉండేందుకు వసతి సౌకర్యంతో పాటు భోజనాలు సైతం ఉచితంగా ఏర్పాటు చేస్తోంది. ఎగ్జిబిషన్‌లో సింగరేణి సంస్థ ఒక స్టాల్‌ను నిర్వహించేందుకు అనుమతి తీసుకుంది. అందులో సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్‌లలో సేవాసమితి మహిళలు తయారు చేసిన చేతి పనులకు సంబంధించిన వస్తువులను విక్రయించుకుంటారు. హైదరాబాద్ స్థాయిలో మార్కెట్ చేసుకునే అవకాశం లభించడం ద్వారా ప్రతి సంవత్సరం సేవా సమితి మహిళలు తాము తయారు చేసిన వస్తువులను భారీ ఎత్తున ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. తాజాగా నాంపల్లిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన క్రమంలో అందులోని ప్రదర్శనశాలలో సేవాసమితి మహిళలు తయారు చేసిన వస్తువులను ఏర్పాటు చేసుకోవడానికి సింగరేణి మరోసారి అవకాశం కల్పించింది.

మెరుగైన ఆదాయం

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాల ద్వారా ఒక్కో సేవాసమితి సభ్యురాలు రూ. 50 వేల వరకు ఆదాయం గడిస్తున్నారు. తాము తయారు చేసిన వస్తువులను స్టాల్‌లో విక్రయిస్తుంటారు. ఒకొక్కరు రూ. 1.5 లక్షల విలువ చేసే చేతి సంచులు, అల్లికలు చేసిన చీరలు, వెదురుతో తయారు చేసిన వస్తువులు, ఎంబ్రాయిడరీ దుస్తులను విక్రయిస్తుంటారు. ఒక్కో డివిజన్ నుంచి ఐదుగురు సభ్యులకు అవకాశం కల్పిస్తారు. 45 రోజుల్లో వంతుల వారిగా మహిళలు తాము తయారు చేసిన వస్తువులను విక్రయిస్తారు. గత పన్నెండేళ్లుగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌లో సేవాసమితి సభ్యులకు స్టాల్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని సంస్థ కల్పిస్తోంది. ఎగ్జిబిషన్‌కు సంబంధించిన నిర్వాహకులతో సంస్థ ఉన్నతాధికారులు మాట్లాడి 2010 నుంచి ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉండటంతో విక్రయాలు సైతం అధికంగానే ఉంటున్నాయి.

ఇబ్బందులు లేకుండా...– సునీత, సేవాసమితి సభ్యురాలు(గోదావరిఖని)
సింగరేణి సంస్థ మాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజన సౌకర్యం ఉచితంగా ఏర్పాటు చేస్తుంది. తయారు చేసిన వస్తువులను స్టాల్‌లో విక్రయించడమే తరువాయి. సంస్థ సహకారంతో ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం లభిస్తుంది. తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉండటంతో మరింత ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తున్నాం

# గీత దాటితే ఈ - చలానా వాత



ఖమ్మం : జిల్లాలో వాహనదారులకు హెచ్చరిక.. నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా వాహనాన్ని నడుపుతామంటే ఇక కుదరదు అంటున్నారు ట్రాఫిక్ పోలీసులు. ట్రాఫిక్ ఉల్లంఘనుల భరతం పట్టడంతోపాటు నేరగాళ్లు, అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు నగరంలోని పలుచోట్ల అధునాతన నిఘా నేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకేసారి డిజిటల్ ఫొటో తీయడం, ఎస్ఎంఎస్ పంపడం, కమాండ్ కంట్రోల్ రూమ్‌కు హెచ్చరికలు జారీ చేయడం వంటి పనులను చకచకా చేసేస్తాయి. రూ. వెయ్యి ఈ–చలానా ఇంటికే వస్తుంది.

నిరంతరం నిఘా

ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నైషన్(ఏఎన్‌పీఆర్) కెమెరాలు అత్యంత అధునాతన టెక్నాలజీని కలిగి ఉన్నాయి. ఇవి డిజిటల్ సాఫ్ట్‌వేర్ ద్వారా వాహనాల నెంబర్ ప్లేట్లను చాలా స్పష్టంగా చిత్రీకరిస్తాయి. నిమిషానికి 90 డిజిటల్ ఇమేజెస్‌ను చిత్రీకరిస్తాయి. అంతేకాకుండా వాహనదారు ట్రాఫిక్ నిబంధన ఉల్లంఘించిన వెంటనే అతడి మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపిస్తాయి. వాహనం నెంబర్‌ను డిజిటల్ ఫొటో చిత్రీకరించిన వెంటనే డాటాబేస్‌లో ఉన్న దాంతో సరిపోల్చుకునేందుకు మాట్‌లాబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించారు. అంతేకాకుండా నిబంధన ఉల్లంఘించిన వాహనదారుడికి వెంటనే ఎస్ఎంఎస్ పంపించేందుకు ఆర్డ్యునో సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఏఎన్‌పీఆర్ కెమెరాలను రూపొందించారు. ఒక్కో కెమెరా విలువ రూ. 5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇవి నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. వీటికి ఇన్‌ఫ్రా–రెడ్ సెన్సార్లు ఉండడం వల్ల చీకట్లోనూ స్పష్టమైన ఫొటో చిత్రీకరించడం ప్రత్యేకత.

ఎన్టీఆర్ సర్కిల్‌లో 12 ఏర్పాటు

ప్రస్తుతం ఖమ్మం బైపాస్‌రోడ్ ఎన్టీఆర్ సర్కిల్‌లో నాలుగు వైపులా ప్రత్యేక స్తంభాలు ఏర్పాటు చేసి 12 అధునాతన కెమెరాలను బిగించారు. వీటిని ఖమ్మం కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు హైదరాబాద్‌లోని ప్రధాన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. అయితే.. ఇవి ఇంకా పని చేయడం ప్రారంభించలేదు. కెమెరాలను అనుసంధాన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్కడి రోడ్లపై హెచ్చరిక గీతలు గీస్తారు. జీబ్రా లైన్లతోపాటు స్టాప్ లైన్ ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా పూర్తవడానికి మరికొన్ని రోజులు పడుతుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ప్రస్తుతం ఎన్టీఆర్ సర్కిల్‌లో కెమెరాలను ఏర్పాటు చేశాం. ఇంకా పనులు జరుగుతున్నాయి. ముఖ్యమైన కూడళ్లలోనూ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఒకసారి ఇవి అందుబాటులోకి వచ్చాక ట్రాఫిక్ ఉల్లంఘనులు, నేరగాళ్లు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకునే పరిస్థితి ఉండదు. ఎస్. రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ, ఖమ్మం

# వార్డుల్లో నివాసం.. జేబుల్లోకి అద్దె భత్యం



భద్రాచలం : భదిరదాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి వైద్య విధాన పరిషత్‌లో మంచి గుర్తింపు ఉంది. ఇలాంటి ఆసుపత్రిలోని ఖరీదైన కొన్ని వార్డులను కొంతమంది వైద్యులు, సిబ్బంది తమ నివాసాలుగా మార్చుకున్నారు. అందుబాటులో ఉండి సత్వర వైద్య సేవలు అందిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నా.. ఆ శాఖకు ఆర్థికంగా కుచ్చుటోపీ పెడుతున్నారు. రోగులకు కట్టించిన వాటిలో ఉద్యోగులు మకాం పెట్టారు. ఇలా ఉండేవారు హెచ్‌ఆర్‌ఏను ఆసుపత్రికి జమ చేయాల్సి ఉంది. ఇటు ప్రభుత్వం ఇచ్చే హెచ్‌ఆర్‌ఏ వాడుకుంటూ అటు రోగుల సౌకర్యార్థం నిర్మించిన గదులను సొంతానికి ఉపయోగించడం విమర్శలకు దారి తీస్తోంది.

చెల్లింపు వార్డు వ్యవస్థ పాతదే

భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి మన్యంతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ నుంచి రోగులు నిత్యం ఇక్కడకు వచ్చి సేవలు పొందుతుంటారు. రోజుకు 400 మందికి ఓపీ సేవలు అందుతుంటాయి. నెలకు సుమారు 400 కాన్పులు చేస్తున్నారు. 2015లో రూ. 18.14 కోట్లు మంజూరవడంతో మరో 100 మంచాలకు సరిపడా నిర్మాణాలు చేశారు. ప్రస్తుతం 200 పడకల దవాఖానాగా కొనసాగుతోంది. కొత్త ఆసుపత్రిలో దాదాపు 10 పడకలను పేవార్డుగా ఏర్పాటు చేశారు. వీటిని రోగులకు వారి బంధువులకు కేటాయించాలన్నది దీని ఉద్దేశం. ఇది కొత్తగా వచ్చిన వ్యవస్థ కాదు. దశాబ్దం కిందట పాత దవాఖానాలో పై అంతస్తులో వార్డును రోగులకు కేటాయించి రోజువారీ అద్దె తీసుకునే వారు. ఆ విభాగంలో సేవలు అందించేందుకు సరిపడా ఉద్యోగులు లేరని సీనియర్లు ఇచ్చిన సలహాలతో దీన్ని విస్మరించారు. మూడేళ్ల కిందట విస్తరణ పూర్తవడంతో ఇబ్బందులు తగ్గాయి.

ఆసుపత్రికి ఆదాయం.. రోగులకు సౌకర్యం

పేరు ప్రఖ్యాతులు గాంచిన పెద్దాసుపత్రికి పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేరు. డీసీహెచ్ఎస్ దీనికి ఇంఛార్జిగా కొనసాగడంతో పర్యవేక్షణ అయోమయంగా మారింది. కరోనా తరుణంలో ఒక ప్రజా ప్రతినిధి ఫిర్యాదు చేశారన్న కారణంతో అప్పటి సూపరింటెండెంట్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఆ తర్వాత ప్రయోగాత్మకంగా డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టును ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. అర్హులైన వైద్యులు ఉన్నప్పటికీ దీన్ని నింపకుండా వేడుక చూస్తున్నారు. సరైన అధికారి అందుబాటులో లేకపోవడంతో పేవార్డుల విషయంలో పారదర్శకత కరవైంది. రోజుకు రూ. 100 నుంచి రూ. 300 తీసుకునేలా గతంలో చర్చలు సాగించారు. ఇలా చేయడం వల్ల రోగులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఆసుపత్రికి ఆదాయం రావడం వల్ల వాటిని మౌలిక సదుపాయాల కోసం సద్వినియోగం చేయవచ్చు ఇష్టమైన వారే వీటిని తీసుకుంటారు. గదికి మాత్రమే అద్దె ఇవ్వాల్సి ఉంటుంది. ఇది అమల్లోకి వస్తే కార్పొరేట్‌కు దీటుగా మారడం ఖాయం.

రికవరీ చేయగలరా..

ఖాళీగా ఉన్న గదుల్లో కొన్నింటిని శిక్షణ పొందుతున్న నర్సులకు అధికారికంగా కేటాయించారు. మిగతా వాటిపై గందరగోళం నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా ఐదుగురు ఉద్యోగులు ఇక్కడ మకాం పెట్టారు. ఆర్ఎంవో స్థాయిలో ఒకరు నిత్యం అందుబాటులో ఉండాలి. ఇదే ప్రాంగణంలో క్వార్టర్స్ ఉన్నందున దాన్ని బాగు చేయించి కేటాయించవచ్చు ఇటీవలే వచ్చిన వైద్యుడు, అత్యవసర సేవల పేరుతో ఇంకో వైద్యుడు, మందుల విభాగంలో విధులు నిర్వహించే ఉద్యోగి, కార్యాలయంలో పని చేసే ఇద్దరు ఆసుపత్రిలో నివాసం ఉంటున్నారు. నెలకు హెచ్‌ఆర్‌ఏ రూపంలో వీరు రూ. 30 వేలు తీసుకుంటున్నారు. ఎప్పటి నుంచి ఎంత మంది ఉంటున్నారో తెలుసుకుని వారి నుంచి ఈ మొత్తాన్ని రికవరీ చేయాల్సి ఉంది.

# అడియాశలే..!




సత్తుపల్లి : ఏకగ్రీవ నిధుల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న పంచాయతీలకు నిరాశే ఎదురైంది. అసెంబ్లీలో నాలుగు రోజుల క్రితం సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనతో పాలకవర్గాలు నీరుగారాయి. ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రోత్సాహకం ఇస్తామని తాము చెప్పలేదని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చెప్పారు. అది తమ విధానం కాదంటూ, కొత్త పంచాయతీరాజ్ చట్టంలో ప్రోత్సాహకాల నిబంధన లేదని ప్రకటన చేశారు. దీంతో నిన్నమొన్నటి వరకు ఎంతో ఆశతో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏకగ్రీవ పంచాయతీలకు నిరాశే మిగిలింది. ప్రోత్సాహక నిధులు వస్తే ఎంతోకొంత అభివృద్ధి చేసుకోవచ్చని సర్పంచులు ఇన్నాళ్లూ భావించారు. రెండేళ్ల క్రితం పంచాయతీ ఎన్నికల సమయంలో ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇస్తుందని పలుచోట్ల నాయకులు, గ్రామస్థులు భావించారు. గ్రామాభివృద్ధి ఆశించి ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవం చేసుకున్నారు. ప్రస్తుతం సీఎం ప్రకటనతో డీలాపడ్డారు. గతంలో ఏకగ్రీవమైన ఒక్కో పంచాయతీకి రూ. 10లక్షలు ప్రోత్సాహక నిధులుగా విడుదల చేశారు. బీ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఏకగ్రీవాలకు మొత్తం రూ. 11.6 కోట్లు రావాలని లెక్కగట్టారు.

# హద్దులు లేని చెరువులు

కరీంనగర్ : ఒకప్పుడు అవి గ్రామాలు.. ప్రస్తుతం కాలనీలుగా మారి స్థలాలకు డిమాండ్ పెరిగింది. అలాంటి పరిస్థితిలో ప్రభుత్వ, పురపాలిక స్థలాలు రక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. నగరంలో ఎనిమిది గ్రామాలు విలీనం కాగా వీటి పరిధిలో విలువైన చెరువులు ఉన్నాయి. అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన అధికారులు పట్టింపు లేకుండా ఉంటున్నారు. రెండేళ్ల కిందట చెరువుల రక్షణ కోసం హద్దు రాళ్లను ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచారు. ఒకటెండ్రు చోట్ల సరిహద్దులు గుర్తించి రాళ్లను వేయించారు. మిగతా చోట్ల పనులు చేయకుండా వదిలేయడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని విలీన కాలనీల్లో చెరువులు ఉన్నాయి. నగరానికి దగ్గరల్లోనే ఉండటంతో ఆక్రమణలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గతంలోనే కొంతమేర కబ్జాల కారణంగా కుదించుకుపోగా, ఉన్న వాటిని కాపాడుకునే బాధ్యత అధికారులపైనే ఉంది. హైదరాబాద్, వరంగల్ మహా నగరాల్లో అయితే చెరువులు చెర బట్టడంతో వర్షాకాలం నీరంతా రోడ్ల మీదనే ప్రవహించే పరిస్థితి ఏర్పడింది. కుంటలు, నాలాలు కనిపించకుండా పోతే భవిష్యత్తులో కరీంనగర్ పరిస్థితి అలాగే తయారు కానుంది. ఈ పరిస్థితి రాకుండా వీటి పరిరక్షణ కోసం గతంలోనే పాలనాధికారి రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. విలీన గ్రామాల్లోని శిఖం భూములు, చెరువులపై సర్వేకు ఆదేశించగా ఆ ప్రక్రియకు మధ్యలోనే బ్రేక్ పడింది.

మూలన పడిన సమగ్ర సర్వే

చెరువులు, కుంటలు, నాలాల రక్షణ కోసం గతేడాది సమగ్ర సర్వే చేపట్టగా అదీ మూలన పడింది. సర్వే చేస్తూ హద్దులు నిర్ణయించేందుకు వీలుగా టెండర్ కూడా పిలిచారు. అందులో భాగంగా పట్టణ ప్రణాళిక, నీటిపారుదల శాఖ సిబ్బంది కలిసి సదాశివపల్లి పూర్తి కాగా, అలుగునూర్ కొంతమేర కొలతలు నిర్వహించారు. అయితే హద్దుల విషయంలో ఇబ్బందులు వస్తుండటంతో రెవెన్యూ, సర్వేయర్ అధికారుల అవసరం ఏర్పడటం, చెరువులలో నీరు అధికంగా ఉందనే కారణాలు చూపుతూ మిగతా కాలనీల్లోని ఉన్న తటాకాలకు హద్దులు నిర్ణయించడం వదిలేసినట్లుగా కనిపిస్తోంది.

హద్దులు మారకముందే

నగరంలోనే చెరువులు లేక ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదనీరంతా మురుగునీటి కాల్వల్లోకి వస్తుండటంతో వాటి సామర్థ్యం సరిపోవడం లేదు. ఏటా వర్షాల సమయంలోనే రహదారులు చెరువులు తలపిస్తున్నాయి. అదే చెరువులు, కుంటలు ఉన్నట్లేయితే అవి నిండిన తర్వాత కాల్వల గుండా నీటిని పంపించుకునే అవకాశం ఉంటుంది. నగర శివారు ప్రాంతాల్లో అత్యధికంగా పొలాల మధ్యన ఉన్నాయి. పొలాల గట్లు పొడిగించకుండా ముందుగానే హద్దులు ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణం కూడా చేస్తున్నట్లుగా ఫిర్యాదులు కూడా వచ్చాయి. ఎప్పటికప్పుడూ అధికార యంత్రాంగం వీటిపై కన్నేసి ఉంచితే విలువైన చెరువులు, కుంటలు దక్కుతాయి.

పర్యాటక ప్రాంతాలు..

నగరానికి శివారు ప్రాంతాల్లోనే ఉండగా జన సంచారం ఉన్న చోట్ల చెరువులను పర్యాటకంగా తీర్చిదిద్దాల్సిన అవసరముంది. అక్కడ ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. వీటి రక్షణతో పాటు ప్రకృతి అందాలు ఆస్వాదించవచ్చు రేకుర్తిలోని బతుకమ్మ చెరువును ఇలా మార్చుకునేలా వీలుంది. దీనిపై ఇప్పటికే ఆ ప్రాంతవాసులు నగరపాలక అధికారుల దృష్టికి తేగా ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదు.

# ఎఫ్‌పీవోలతో రైతులకు ప్రయోజనం

ఆదిలాబాద్ : అన్నదాతల ఆరుగాలం శ్రమకు ఫలితంగా దక్కేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారుల నేతృత్వంలో అన్నదాతలు రైతు ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీవో)లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో ఐదు ఎఫ్‌పీవోలు ఏర్పాటయ్యాయి. నెన్నెల మండలంలో రెండు, చెన్నూరు జైపూర్, మందమర్రి మండలంలో ఒక్కో ఎఫ్‌పీవోను ఏర్పాటు చేశారు. ఎఫ్‌పీవోల పనితీరు, కారాచరణపై సీఈవోలు, డైరెక్టర్లు, సభ్యులకు అధికారులు అగాహన కల్పిస్తున్నారు. విజయవంతంగా నడుస్తున్న ఎఫ్‌పీవోల పనితీరును పరిశీలించేందుకు మహారాష్ట్రలో నాలుగు రోజులు పర్యటించి వచ్చారు. సంఘాలుగా ఏర్ప డిన రైతులు కలిసి కట్టుగా పంటలు సాగు చేసి వ్యాపారులుగా మారను న్నారు. ఇందుకుగాను ఉద్యానశాఖ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తోంది. సంస్థల ఏర్పాటుతో భూసార పరీక్షలు, సస్యరక్షణ, అధునాతన యంత్రాల వినియోగం వరకు ప్రతీది రైతులకు అందుబాటులోకి వస్తార్న్లు. వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కార్యక్ర మాలు నిర్వహించనున్నారు. దీంతో ఎఫ్‌పీవోలపై రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.

– ఎఫ్‌పీవో అంటే.... ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో). వీటినే తెలుగులో రైతు ఉత్పత్తి సంస్థలుగా పిలుస్తారు. ఒక ఎఫ్‌పీవోలో రెండు వేల మంది వరకు రైతులు సభ్యత్వం పొందవచ్చు. కంపెనీ యాక్ట్ ప్రకారం పది మంది డైరెక్టర్లతో రిజిస్ట్రేషన్ చేస్తారు. రైతులు షేర్ క్యాపిటల్ చెల్లించి సభ్యత్వం పొందాల్సి ఉంటుంది. ఇలా సభ్యులైన రైతులకు విత్తనాలు, ఎరువులు, పరికరాలు, యంత్రాలు సబ్సిడీపై అందజేస్తారు. సభ్యులైన రైతులు పంటలకు వారే గిట్టుబాటు ధరలను నిర్ణయించి సంస్థ ద్వారా అమ్ముకుంటారు. ఆసక్తి ఉన్న రైతులు చిన్న పరిశ్రమలను ఏర్పాటుకు రాయితీలు కల్పిస్తూ సంఘాలు స్వయం ప్రతిపత్తిని పొందేందుకు ప్రభు త్వం పెట్టుబడి సాయాన్ని 75 శాతం సబ్సిడీతో అందిస్తుంది. పంటలకు సులభంగా మార్కెటింగ్ చేసుకునేలా రైతులకు సంస్థలు అండదండలు అందిస్తాయి. ఒక్కో ఎఫ్‌పీవోలో రెండు వేల మంది వరకు రైతులను సంస్థలో చేర్చుతారు. పెట్టుబడిదారులు, వ్యాపారులుగా వచ్చే లాభాన్ని రైతులే పొందే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వెయ్యి మందిని చేర్చుకుని షేర్ క్యాపిటల్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం కూడా అంతే మొత్తంలో సాయం చేస్తుంది. ప్రభుత్వ శాఖలు, ఆర్థిక సంస్థల నుంచి సాయం పొందవచ్చు. రైతులు పండించిన పంటను దళారి బారిన పడకుండా అనువైన మార్గాలను అన్వేషిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను వాటి ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు ప్రయ త్నాలు చేస్తున్నారు. ఇక్కడి రైతుల ఉత్పత్తుల డేటా రూపొందించి ఆన్‌లైన్‌లో పెడితే ఎగుమతిదారులు నేరుగా వచ్చి మంచి ధరకు కొనుగోలు చేసుకుంటారు.

– నేరుగా విక్రయించడం కంటే

నేరుగా దిగుబడిని విక్రయించడం కంటే విలువ ఆధారిత ఉత్పత్తులతో అమ్మకాలు చేపడితే అధిక లాభాలు సాధించవచ్చు. మామిడికి విలువలు జోడించడంపై ఎఫ్‌పీవోలు దృష్టిసారించనున్నాయి. మామిడితో తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా సాగును లాభసాటిగా మార్చుకోవచ్చని భావిస్తున్నారు. మామిడి తాండ్ర, జ్యూస్, పచ్చళ్లు, ఒరుగులు తదితరాలను తయారు చేస్తే సీజన్ లోనే కాకుండా ఏడాదంతా రాబడి ఉంటుంది. ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇంతే కాకుండా ధరలేని సమయంలో కోల్డ్‌స్టోరేజీలలో కాయలనునిల్వ ఉంచుకొని ధర పలికినప్పుడు అమ్ముకోవ చ్చు.

# ధరల బూమ్



మహబూబ్‌నగర్ : పాలమూరు జిల్లాలో నాలుగేళ్లలో రియల్ బూమ్ విస్తరించింది. నాలుగేళ్ల క్రితం వరకు జిల్లా కేంద్రంతో సహా, పట్టణాలు, గ్రామాల్లో నివాస స్థలాలు, వ్యవసాయ భూములకు అంతగా ధరలు లేనిస్థితి నుంచి నేడు నాలుగు రెట్లు ధరలు వెచ్చించినా భూములు, స్థలాలు లభించని పరిస్థితి నెలకొన్నది. జాతీయ రహదారుల విస్తరణ, పట్టణాల మధ్య అంతర్గత రోడ్లు, శివారు కాలనీల్లోనూ రోడ్ల ఏర్పాటుతో పల్లెల్లో భూములు కొనేందుకు హైదరాబాదీలు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతోద్యోగులు ముందుకొస్తున్నారు. దాంతో ధరలు చుక్కలనంటుతున్నాయి. మధ్య తరగతి ప్రజలు భూములు కొనలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఏప్రాంతంలోనైనా ఎకరా భూమి కనీసం రూ.25 లక్షలు ధర ఉండగా, సగటున రూ. 40 లక్షలు, గరిష్ఠంగా రూ.రెండు కోట్ల వరకు ధరలు ఉన్నాయి.
పట్టణ ప్రాంతాల్లో అధికమైన ధరలు జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పట్టణాలతో పాటు ఇటు బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి, అటు మహబూబ్‌నగర్–తాండూరు రహదారి, మరోవైపు జడ్చర్ల– రాయచూరు, ఇంకోవైపు జడ్చర్ల–కోదాడ ప్రధాన రహదారుల వెంట ఉన్న మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం ఇళ్ల స్థలాల ధరలు నాలుగేళ్లలో నాలుగు రెట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్– జడ్చర్ల–భూత్పూర్ పట్టణాల మధ్య ఎక్కడ చూసినా వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మహబూబ్‌నగర్ పట్టణ కోర్ సిటీలో చదరపు గజం స్థలం నాలుగేళ్ల క్రితం రూ.40 వేలుంటే, ప్రస్తుతం ధర రూ. లక్ష వరకు ఉన్నది. రెండో ప్రాధాన్యం గల నివాస ప్రాంతాల్లో చదరపు గజం స్థలం నాలుగేళ్ల కిందట రూ.25 వేల వరకు ఉంటే ప్రస్తుతం రూ.60 వేల నుంచి రూ.75 వేల వరకు పలుకుతోంది. జడ్చర్లలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ప్రధానంగా మహబూబ్‌నగర్–భూత్పూర్ మార్గంలో, మహబూబ్‌నగర్–జడ్చర్ల మార్గంలో, నూతనంగా నిర్మించిన ఏనుగొండ– న్యూ కలెక్టరేట్ మార్గంలో ఉన్న పాలకొండ, ఏనుగొండ, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాలలో నాలుగేళ్ల కిందట గజం స్థలం ధర రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ఉంటే, ప్రస్తుతం చదరపు గజానికి రూ. 18 వేల నుంచి రూ. 25 వేలు, రూ. 30 వేల వరకు చేరడం ఇక్కడి రియల్ భూమ్‌ని సూచిస్తోంది. ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన బైపాస్ రోడ్డు, మహబూబ్‌నగర్– భూత్పూర్ రోడ్డు విస్తరణ, భూత్పూర్–అమిస్తాపూర్ కలిపి మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడం ఇక్కడి స్థలాల ధరల పెరుగుదలకు కారణంగా చెప్పొచ్చు. భూత్పూర్– తాటిపత్రి– కరివెన మార్గంలో సైతం భారీగా వెంచర్లు వెలిశాయి. రిజర్వాయర్ పూర్తయితే ఈప్రాంతం సెమీ అర్బన్‌గా మూడు పట్టణాలకు మధ్యలో మరో నివాస ప్రాంతంగా ఉంటుందనే ప్రచారంతో ఇక్కడ స్థలాలను అమ్మేస్తున్నారు. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్ల వెంట ఉన్న మండల కేంద్రాలు, గ్రామాల్లో కూడా ధరలు అదే స్థాయిలో ఉన్నాయి.
ఫార్మ్‌హౌస్‌ల కల్చర్‌తో భారీగా పెరిగిన ధరలురాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా, భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటం, ఏమూలకు వెళ్లాలన్నా రోడ్డు మార్గం ఉండటంతో మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూముల ధరలు ఈ నాలుగేళ్లలో బాగా పెరిగాయి. హైదరాబాద్‌లో పని చేస్తోన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్, గ్రూప్ వన్ స్థాయి అధికారులు, పారిశ్రామికవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు ఈ ప్రాంతంలో భూములు కొంటున్నారు. జాతీయ రహదా రుల వెంట ఆనుకొని ఉండే గ్రామాల్లో వ్యవసాయ భూమి ఎకరాకు నాలుగేళ్ల కిందట రూ.20 లక్షలకు లభిస్తే, ప్రస్తుతం రూ.1.50 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు చేరింది. ప్రధానంగా హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి వెంట వ్యవసాయ భూములకు ఈ ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సాగు భూములు కనిష్ఠంగా ఎకరాకు రూ.20 లక్షల ధర ఉండగా, సగటున రూ.30 లక్షల వరకు లభిస్తున్నాయి. రోడ్డు మార్గం, నీటి వనరు, భూమి నాణ్యత ఉంటే ఎకరం కనీసం రూ.50 లక్షల ధర ఉంది. జిల్లాలో ఈ నాలుగేళ్లలో ఫార్మ్‌హౌస్‌లు, అధికంగా భూములు కొని తోటల పెంపకాలు చేస్తుండటంతో ధరలు పెరిగాయి. చాలా మంది 20 ఎకరాలు మొదలుకొని 100 ఎకరాల వరకు కొని మామిడి, జామ వంటి తోటలు పెంచడంతో పాటు ఫార్మ్‌హౌస్‌లుగా అన్ని వనరులతో ఏర్పాటు చేసుకుంటున్న సంస్కృతి ఇటీవల జిల్లాలో వ్యాపించింది.

# నవజాత శిశువులకు నిశ్చింత



గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్‌ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్) సేవలు ప్రారంభమయ్యాయి. గత ఏడాది డిసెంబర్ 22న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లా పర్యటన సందర్భంగా ఈ యూనిట్‌ను ప్రారంభించారు. కానీ పూర్తి స్థాయిలో పరికరాలు లేకపోవడం, అవసరమైన సిబ్బందిని నియమించకపోవడం తో వైద్య సేవలను ప్రారంభించలేదు. ఇటీవల పనులు పూర్తి కావడం, అవసరమైన పరికరాలు ఆస్పత్రికి చేరడం, సిబ్బందిని కూడా నియమించడంతో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో వైద్య సేవలను ప్రారంభించారు. దీంతో నవ జాత శిశువులకు అధునాతన వైద్య సేవలు అందు బాటులోకి వచ్చాయి.
20 రేడియంట్ వార్మర్లు అప్పుడే పుట్టిన పిల్లలకు చర్మం పలుచగా ఉంటుంది. దీంతో వారికి పలు ఇబ్బందులు కలిగే అవకాశ ముంది. వారికి అవసరమైన వేడిని అందించేందుకు ఈ రేడియంట్ వార్మర్లు ఎంతగానో తోడ్పడతాయి. జిల్లా అసుపత్రిలోనే జన్మించిన శిశువులకు 10, ఇతర ఆసుపత్రిలలో పుట్టిన వారికి 10 చొప్పున మొత్తం 20 వార్మర్లు అందుబాటులో ఉన్నాయి. శ్వాసకోశ ఇబ్బందుల నివారణకు సీ–ప్యాప్ అప్పుడే పుట్టిన చిన్నారులలో ఎక్కువగా శ్వాసకోశ ఇబ్బందులు ఏర్పడుతాయి. ఈ సమస్య పరిష్కారం కోసం సీ–ప్యాప్ మిషన్లు సిద్ధంగా ఉన్నాయి. వీటితో చిన్నారులను ఎక్కువగా ఇబ్బంది పెట్టే శ్వాసకోశ సమస్యలు దూరం కానున్నాయి.
పసిరికల నివారణకు ఫోటో థెరపీ నవజాత శిశువులు ఎక్కువగా పసిరికలతో చాలా ఇబ్బందులకు పడుతుంటారు. దీనికి వైద్యం అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా ఖర్చు అవుతుంది. ఇప్పుడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఫోటో థెరపీ యూనిట్లు అందుబాటులోకి రావడంతో శిశువులకు ఉచితంగా వైద్యసేవలు అందనున్నాయి.
ల్యాబ్‌ను వెంటనే ప్రారంభించాలి అయితే జిల్లా ఎస్‌ఎన్‌సీయూ ల్యాబ్‌లో చిన్నారులకు వివిధ పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీరికి పరీక్షలు చేసిన వెంటనే రిపోర్టు వస్తే వైద్యులు సత్వర చికిత్స అందించే అవకాశం ఉంటుంది. అయితే ల్యాబ్ ఇంకా ప్రారంభం కాలేదు. టీ హబ్‌లో పరీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నా రిపోర్టులు మరుసటి రోజు రావడం కొంత ఇబ్బందిగా మారింది. దీంతో అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడు తల్లిదండ్రులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ల్యాబ్‌ను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నారుల మరణాలను తగ్గించేందుకే.. చిన్నారుల మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఎస్‌ఎన్‌సీయూలో అన్ని పరికరాలను సమకూర్చింది. ప్రత్యేకంగా ముగ్గురు వైద్యులు, ఎనిమిది మంది స్టాఫ్ నర్సులను నియమించింది. స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ అందుబాటు లోకి రావడంతో చిన్నారుల మరణాలను పూర్తి నివారించే అవకాశం కల్గింది.

# తుది దశకు డబ్లింగ్

మహబూబ్‌నగర్ : దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ పనులు తుది దశలో ఉన్నాయి. ఈ నెలాఖరులోగా పెండింగ్ పనులు పూర్తి చేసి డబ్లింగ్ ట్రాక్‌ని అందుబాటులోకి తేవాలని రైల్వే అధికారులు పనులు వేగవంతం చేయించారు. మొత్తం 85 కిలో మీటర్ల మేర డబ్లింగ్, విద్యుదీకరణ చేపట్టేందుకు ఎంతో కాలంగా డిమాండ్ ఉంది. 2015–16 బడ్జెట్‌లో కేంద్రం రూ.775 కోట్ల నిధులు మంజూరు చేసింది. అప్పటినుంచి వరుసగా ప్రతీ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.మూడు ప్యాకేజీలుగా పనులుసికింద్రాబాద్–మహబూబ్‌నగర్ మధ్య రైల్వే డబ్లింగ్ లైన్, విద్యుదీకరణ పనులను మూడు ప్యాకేజీలుగా విభజించారు. ఉందానగర్– గొల్లపల్లి వరకు 60 కిలో మీటర్ల డబ్లింగ్, విద్యుదీకరణ పనులు చాలా కాలం కిందటే పూర్తవగా, దివిటిపల్లి–మహబూబ్‌నగర్ మధ్య 10.500 కిలో మీటర్ల పనులు ఇటీవలే పూర్తయ్యాయి. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం ఒక్కటి కొనసాగుతోంది. అదేవిధంగా దివిటిపల్లి– గొల్లపల్లి మధ్య మిగిలిన 14.500 కిలోమీటర్ల మార్గంలో జడ్చర్ల పట్టణంలోని పాతబజార్ వద్ద కొంతమేర పెండింగ్ పనులు సాగుతుండగా, మిగిలిన అంతటా పూర్తయ్యాయి. ఈ పనులను కూడా వేగంగా పూర్తి చేసి, మార్చిలో లైన్‌ను వినియోగంలోకి తెచ్చేలా రైల్వే అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు. డబ్లింగ్ లైన్, విద్యుదీకరణతో పాటు షాద్‌నగర్, బాలానగర్, రాజాపూర్, గొల్లపల్లి, దివిటిపల్లి రైల్వే స్టేషన్లను సైతం ఆధునికీకరించారు. నూతన భవనాలు, సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఈ పనుల్లో భాగంగానే అవసరమైన అన్ని చోట్లా అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించారు.



# తిరుపతి–సికింద్రాబాద్ మార్గంలో వందేభారత్

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య మరో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ త్వరలోనే పట్టాలు ఎక్కనుంది. సికింద్రాబాద్–తిరుపతిల మధ్య ఈ రైలు అందుబాటులోకి రానుందని రైల్వే వర్గాల సమాచారం. నిర్వహణపరమైన ఏర్పాట్లతో అందుకు సిద్ధంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే సంబంధిత రైల్వే డివిజన్ల అధికారులకు గురువారం రాత్రి సమాచారం అందించింది. వారంలో ఆరు రోజుల పాటు ఈ రైలు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలుస్తోంది.
**వయా నల్గొండ, గుంటూరు :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ప్రధాని నరేంద్రమోదీ సంక్రాంతి రోజున ప్రారంభించిన తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్–విశాఖపట్నంల నడుమ నడుస్తోంది. దీనికి మంచి ఆదరణ లభిస్తోంది. హైదరాబాద్ నుంచి తిరుపతికి నిత్యం వేల సంఖ్యలో శ్రీవారి భక్తులు ప్రయాణిస్తుంటారు. మూడు నాలుగువారాల ముందు ప్రయత్నిస్తే తప్ప రిజర్వేషన్ దొరకదు. ప్రయాణికుల నుంచి డిమాండ్ భారీగా ఉండటంతో రైల్వేశాఖ సికింద్రాబాద్–తిరుపతిల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించాలని నిర్ణయించింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి కాజీపేట–విజయవాడ, నల్గొండ–గుంటూరు, మహబూబ్‌నగర్–కర్నూలు, వికారాబాద్–తాండూరు–రాయచూరు.. ఇలా నాలుగు మార్గాల్లో రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. సికింద్రాబాద్–తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నల్గొండ–మిర్యాలగూడ–గుంటూరు మార్గంలో నడిపించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఏయే స్టేషన్లలో ఆగుతుంది, ఛార్జీలు, ప్రయాణ సమయంపై స్పష్టత రావాల్సి ఉంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 8న ప్రారంభించే అవకాశాలున్నాయి. తెలుగు రాష్ట్రాల మధ్య తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్‌లో ప్రారంభించిన నేపథ్యంలో రెండోదాన్ని తిరుపతిలో ప్రారంభించనున్నట్లు తెలిసింది.



## రాహుల్ చెప్పినట్లే.. సిద్ధరామయ్య పోటీ

# కర్ణాటకలో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు గడువు దగ్గరపడుతున్న వేళ.. రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. తాజాగా రాష్ట్రంలో ప్రధాన విపక్షమైన కాంగ్రెస్ పార్టీ.. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. అందరూ ఊహించినట్లుగానే హస్తం పార్టీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ సారి కోలార్ స్థానం నుంచి కాకుండా వరుణ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇందుకోసం ఆయన కుమారుడు యతీంద్ర తన సీటును త్యాగం చేశారు.
**రాహుల్ గాంధీ సలహా మేరకు..** సిద్ధరామయ్య గతంలో చాముండేశ్వరి, వరుణ నియోజకవర్గాల్లో అనేకసార్లు విజయం సాధించారు. అయితే 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుమారుడు యతీంద్ర కోసం వరుణ నియోజకవర్గాన్ని త్యాగం చేసిన సిద్ధరామయ్య.. బదామీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఆయన కోలారు నుంచి పోటీ చేయాలని భావించారు. దీనిపై అధిష్ఠానంతో మంతనాలు కూడా జరిపారు. కాగా.. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. కోలారు నుంచి పోటీ వద్దని సిద్ధుకు సూచించారు. ఈ నేపథ్యంలోనే వరుణ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న యతీంద్ర కూడా తండ్రి కోసం తన స్థానాన్ని త్యాగం చేసేందుకు సిద్ధపడ్డారు. ఫలితంగా సిద్ధరామయ్య వరుణ నుంచి బరిలోకి దిగారు. ఈ మేరకు నేటి జాబితాలో వరుణ అభ్యర్థిగా ఈ మాజీ సీఎం పేరును కాంగ్రెస్ ప్రకటించింది.
**యతీంద్రకు ఎంపీ టికెట్..? :** వచ్చే ఎన్నికల్లో యతీంద్ర ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు. తాజా జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బరిలోకి దిగకపోవచ్చని సమాచారం. వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో యతీంద్రకు ఎంపీ టికెట్ ఇచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి.
**124 మందితో తొలి జాబితా..** ఇక, అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ 124 మందితో తొలి జాబితాను శనివారం విడుదల చేసింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ డీకే శివకుమార్.. కనకపుర స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇక, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే.. చీతాపూర్ నుంచి, మాజీ ఉపముఖ్యమంత్రి జి. పరమేశ్వర కోరటగెరె స్థానం నుంచి బరిలోకి దిగుతున్నట్లు పార్టీ ప్రకటించింది. కాగా.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ ఇంకా షెడ్యూల్ ప్రకటించలేదు. ఈ ఎన్నికలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన తొలి పార్టీ కాంగ్రెస్సే. ఈ ఏడాది మే నెలతో ప్రస్తుత శాసనసభ గడువు ముగియనుంది. ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగే అవకాశముంది.



## రాహుల్‌పై అనర్హత వేళ..

# సుప్రీంలో కీలక పిటిషన్

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేళ సుప్రీంకోర్టులో కీలక పిటిషన్ దాఖలైంది. దోషిగా తేలిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఆటోమేటిక్‌గా అనర్హులుగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త అభా మురళీధరన్ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3) రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ ఈ పిటిషన్ వేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3) కింద.. దోషిగా తేలిన ప్రజాప్రతినిధిని ఆటోమేటిక్‌గా అనర్హుడిగా ప్రకటించడం రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషనర్ ఆరోపించారు. సంబంధిత సభ్యునిపై ఉన్న నేరాల స్వభావం, తీవ్రతతో సంబంధం లేకుండానే ఆయనపై అనర్హతను అమలు చేయడం రాజ్యాంగంలోని 14వ అధికరణను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమైన “ఆటోమేటిక్” అనర్హత పై తగిన ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. రాహుల్‌పై అనర్హత వేటు పడిన మరుసటి రోజే సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు దోషిగా తేలిన ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేసే ముందు మూడు నెలల సమయం ఇచ్చేవారు. ఆలోపు పై కోర్టులలో అప్పీలు చేసుకోవచ్చు. న్యాయపరమైన అవకాశాలన్నీ వినియోగించుకునే వరకు వారిపై వేటు పడేది కాదు. అయితే ఈ నిబంధనపై గతంలో సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. న్యాయస్థానం దాన్ని కొట్టేసింది. ప్రజాప్రతినిధులు దోషులుగా తేలిన వెంటనే అనర్హులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అందుకు అనుగుణంగా ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951లో సవరణలు చేశారు. ఆ సవరణల ప్రకారమే తాజాగా రాహుల్‌పై అనర్హత వేటు పడింది.

## ఆలియా జీవితంలో ఎప్పుడూ ఇన్ని పాట్లు పడలేదట!

ప్రతి ఒక్కరికీ జీవితంలో తొలి అనుభవం అనేది కొత్తగా వింతగా గమ్మత్తుగా అనిపిస్తుంది. ఆలియాకు కూడా అలాంటి అనుభవమే అయ్యింది. అయితే దానికి కారకుడు ఎవరు? అంటే జక్కన్న. తాజాగా ఆలియా భట్ సెట్స్ నుండి తన అనేక మొదటి విషయాలను పంచుకుంది. ఆమె ఒకటిన్నర సంవత్సరం పాటు ఒక ప్రత్యేక సన్నివేశాన్ని అభ్యసించానని వెల్లడించింది. అలియా భట్ భారీ పాన్ ఇండియా మూవీ తో తెలుగు సినిమా రంగ ప్రవేశం చేసింది. %ూా% రాజమౌళి దర్శకత్వం వహించిన పాన్-ఇండియా చిత్రంలో ఆలియా చేసినది చిన్న పాత్రే అయినప్పటికీ కీలకమైన పాత్రను పోషించింది. జూనియర్ ఎన్టీఆర్ - రామ్ చరణ్ హీరోలుగా నటించగా.. ఈ సినిమాలో సీత పాత్రలో అలియా నటించింది. చిన్న పాత్రలో చేసినా ఆలియా ఎలాంటి భేషజానికి పోకుండా చిత్ర బృందంతో కలిసి సినిమాను చురుకుగా ప్రమోట్ చేసింది. ఇప్పుడు చిత్రం విడుదలైన ఒక వారం తర్వాత అలియా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తన అరంగేట్రం ను మననం చేసుకుంటూ... తన అనేక మొదటి విషయాల (ఫస్ట్ టైమ్ మ్యాటర్స్) గురించి మాట్లాడుతూ ఉన్న



వీడియోను షేర్ చేసింది. ఆర్ఆర్ఆర్లోని ఒక సన్నివేశాన్ని ఏడాదిన్నర పాటు ప్రాక్టీస్ చేశానని అలియా భట్ వెల్లడించింది. ఆలియా ఆర్.ఆర్.ఆర్ ని ప్రమోట్ చేస్తున్నప్పుడు చిత్రీకరించిన వీడియోలో చాలా సంగతులను చెప్పింది. మొట్టమొదట తెలుగు నేర్చుకున్నానని చెప్పింది. తాను తొలిసారిగా ఏడాదిన్నర పాటు ఓ సీన్ ని ప్రాక్టీస్ చేశానని కూడా ఆలియా వెల్లడించింది. లాక్ డౌన్ కారణంగా నేను మొదటిసారిగా ఒకటిన్నర సంవత్సరాలు ఒక సన్నివేశాన్ని నేర్చుకున్నాను. కాబట్టి నేను దానిని నేర్చుకోవడం ప్రారంభించాను.. ఎందుకంటే నేను ఒక నెలలో షూట్ చేయాలనుకోగా.. ఆపై లాక్ డౌన్ లోకి వెళ్లాము. ఆపై నేను దానిని ఒకటిన్నర సంవత్సరాలు నేర్చుకుంటూనే ఉన్నాను" అని ఆమె తెలిపింది. కరోనా వల్ల పదే పదే వాయిదా పడుతుంటే ఇలా చేయాల్సొచ్చిందని అర్థం చేసుకోవాలి. తన పాత్ర కోసం తన జుట్టుకు చాలాసార్లు రంగులు వేయవలసి వచ్చిందని కూడా ఆలియా చెప్పింది. మొదటిసారి నా జుట్టు రంగు ఆర్.ఆర్.ఆర్ తో పాటు మరో మూవీ కోసం కొనసాగింపులో ఉంది. లో నేను ముదురు జుట్టు కలిగి ఉండవలసి వచ్చింది. నేను జుట్టుకు రంగు వేసుకున్నాను కానీ లైట్ కారణంగా సెట్ కి వెళ్లినప్పుడు హైలైట్స్ ఇప్పటికీ కనిపించాయి " అని ఆమె చెప్పింది.

తన బృంద సభ్యులలో ఒకరు మేము హొటల్ కి వెళ్లి జుట్టుకు నాలుగు సార్లు రంగులు వేసుకున్నాము అని కూడా తెలిపారు. ఆర్.ఆర్.ఆర్ షూటింగ్ లో ఉండగానే ఓ సినిమా సెట్స్ లో తొలిసారి బిర్యానీ తిన్నానని అలియా తెలిపింది. అలాగే ఆర్.ఆర్.ఆర్ ప్రచారం కోసం చాలా ఎక్కువ సమయం కేటాయించానని ఇన్ని పాట్లు ఇంతకుముందు ఎప్పుడూ పడలేదనే అర్థంలోనూ ఆలియా మాట్లాడింది. ఆర్.ఆర్.ఆర్ ప్రమోషన్స్ కోసం జక్కన్న చాలా ప్రిపరేషన్ సాగించేవాడని తనకు ఇలాంటి భారీ ప్రచారం అనేది ఇదే తొలిసారి అని కూడా వెల్లడించింది. మామూలుగానే హిందీ చిత్రాలకు ఇంత భారీ ప్రమోషన్ ఈవెంట్లు ఉండవు గనుక ఆలియాకు సౌత్ లో అసలు విషయం అర్థమైందన్నమాట.

## అమ్మడి ఆశలు మళ్లీ అడియాసలయ్యనే..!

ప్రస్తుతం టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో బుట్టబొమ్మ పూజా హెగ్డే ఒకరు. స్టార్ హీరోల ఫస్ట్ ఛాయిస్ గా మారిన ఈ భామ.. వరుసగా క్రేజీ ఆఫర్స్ అందుకుంటూ ఫుల్ ఫార్మ్ లో కొనసాగుతోంది. ఇప్పుడు బాలీవుడ్ లో కూడా అవకాశాలు అందుకుంటోంది. అయితే తనను హీరోయిన్ ని చేసిన తమిళ ఇండస్ట్రీలో రాణించాలనే పూజా కోరిక మాత్రం తీరడం లేదు. 'ముగముడి' (తెలుగులో 'మాస్క్') అనే తమిళ చిత్రంతో తెరంగేట్రం చేసింది పూజా హెగ్డే. అయితే అమ్మడికి తొలి సినిమా నిరాశనే మిగిల్చింది. దీంతో రెండేళ్ల తర్వాత 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై ఓ మోస్తరు విజయాన్ని అందుకుంది. ఈ క్రమంలో 'డీజే-దువ్వాడ జగన్నాథమ్' 'మహర్షి' 'అరవింద సమేత వీర రాఘవ' 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్ బస్టర్లు అందుకుంది. తెలుగులో అగ్ర స్థానంలో నిలిచినా పూజా కోలీవుడ్ లో స్టార్ స్టేటస్ అందుకోవాలనే ప్రయత్నం మాత్రం వదల్లేదు. ఈ నేపథ్యంలో దాదాపు పదేళ్ల తర్వాత లేటెస్టుగా "బీస్ట్" సినిమాతో తమిళ ప్రేక్షకులను పలకరించింది. విజయ్



హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా ఇది. దీంతో పూజా తమిళనాట కూడా స్టార్ హీరోయిన్ గా మారిపోతుందని ఫ్యాన్స్ భావించారు. భారీ అంచనాల నడుమ బుధవారం విడుదలైన 'బీస్ట్' సినిమాకు మిశ్రమ స్పందన లభించింది. సినీ విశ్లేషకుల రివ్యూలు ఏమాత్రం ఆశాజనకంగా లేవు. సినిమా రిజల్ట్ ఏంటనేది పక్కన పెడితే.. ఇందులో పూజా హెగ్డే పాత్ర పట్ల అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇలాంటి ప్రాధాన్యత రోల్ లో క్యారక్టర్ లో ఎందుకు నటించిందో అని కామెంట్స్ చేస్తున్నారు. 'బీస్ట్' ట్రైలర్ లో అలా మెరుపుతీగ లాగా ఒక్కసారి అలా కనిపించి మాయమైనప్పుడే పూజా హెగ్డేకు ఇందులో ఏమాత్రం ఇంపార్టెన్స్ ఉందో అని ఆడియన్స్ ఆలోచించారు.

అయితే ఇప్పుడు సినిమా చూశాక అందరికీ స్పష్టత వచ్చేసింది. ఎందుకంటే ఆమె పాత్ర అంతలా నిరాశ పరిచేలా ఉంది. రెండు పాటల్లో మెరవడం తప్పితే.. పూజా హెగ్డేకు ఇందులో ఏమాత్రం ప్రాధాన్యత లేదు. ఇలాంటి సైడ్ క్యారక్టర్ గురించా ఇన్నాళ్లూ అమ్మడు ఇంత హంగామా చేసిందా అని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్లకు కూడా సమప్రధాన్యత ఇస్తున్నారని భావిస్తున్న తరుణంలో.. 'బీస్ట్' సినిమాలో పూజా చేసిన రోల్ ఆ దృక్పథాన్ని మార్చేస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం మీద పదేళ్ల తర్వాత తమిళంలోకి రీఎంట్రీ ఇచ్చినా.. దీని కోసం విజయ్ వంటి స్టార్ హీరో సహాయం తీసుకున్నా పూజా హెగ్డేకి అక్కడ నిరాశ తప్పలేదు. ఇటీవల 'రాధేశ్యామ్' తో ఫ్లాప్ అందుకున్న ఈ బ్యూటీకి వరుసగా ఇది రెండో పరాజయమనే అనుకోవచ్చు. అయినప్పటికీ తెలుగులో అమ్మడికి అవకాశాల విషయంలో డోకా లేదు.




## అనంతపురం సైనైడ్ అగ్గి రాజేసిందిగా



సీమ నుంచి సైనైడ్ లా దూసుకొచ్చింది ప్రియాంక జవాల్కర్. టాక్సీవాలా సినిమాతో కుర్రకారు గుండెల్లో నిలువు గీత గీసింది. యువత మెచ్చే అందం చందం నటన తన సొంతం అని ఇప్పటికే నిరూపించింది. ఇటీవల కెరీర్ పరంగా బిజీ అయిపోయింది. పనిలో పనిగా తన స్టార్ డమ్ కి తగ్గట్టే సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి ఉన్న ఫాలోయింగ్ పెరుగుతోంది. ఈ వేదికపై నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లను షేర్ చేస్తూ అభిమానుల్ని యంగేజ్ చేస్తోంది. తాజాగా ప్రియాంక షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. సింపుల్ గా అలా వైట్ ఫ్రాక్ లో థై సొగసుల్ని ఎలివేట్ చేస్తూ క్లాసీ ఫోటోషూట్ తో మతులు చెదరగొట్టింది ఈ బ్యూటీ. అనంతపురం హాట్ బాంబర్ ప్రియాంక జవాల్కర్ మరోసారి అగ్గి రాజేసిందిగా అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇక ప్రియాంక కెరీర్ నెమ్మదిగా స్పీడందుకుంటోంది. తొలి సినిమా కలవరమాయే అంతగా గుర్తింపు తేనప్పటికీ దేవరకొండ టాక్సీవాలా కెరీర్ కి కీలకమలుపునిచ్చింది. నటిగా ప్రియాంకకు యూత్ ఫుల్ మార్క్స్ వేశారు. ఇక గ్లామరస్ హీరోయిన్ గా ఒక ముంబై డాళ్ కి తగ్గని వయ్యారం తన సొంతం అని ప్రూవ్ చేస్తోంది. ఇటీవల వరుస చిత్రాలతో తెలుగు ఆడియెన్ ని పలకరించింది ప్రియాంక. ఈ బ్యూటీ నటించిన తిమ్మరుసు సినిమా పాజిటివ్ సమీక్షలు అందుకున్నా కానీ ఆశించిన రేంజును అందుకోలేకపోయింది.

సత్యదేవ్ సరసన ప్రియాంక నటనకు గుర్తింపు దక్కింది. ఇక ప్రియాంక నటించిన మరో సినిమా ఎస్.ఆర్ కళ్యాణ మండపం ఎలాంటి అంచనాలు లేకుండా ప్రేక్షకుల ముందుకొచ్చి మంచి హిట్ టాక్ తెచ్చుకుంది. ఆద్యంతం ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించిన కామెడీ లవ్ ఎంటర్ టైనర్ గా ఇది నిలిచింది. ఈ సినిమా విజయం సాధించడంతో ప్రియాంక వరుసగా అవకాశాలు చేజిక్కించుకుంటోంది. ప్రస్తుతం సుజన్ రావు అనే కొత్త దర్శకులు తెరకెక్కిస్తున్న గమనం అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కూడా తనకు పేరు తెస్తుందని తెలుగమ్మాయి నమ్ముతోంది. సమ్మర్ వేళ అనంతపురం అమ్మాయి మరీ ఇలా చెలరేగితే కష్టమే అంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. హూ దట్ ! అంటూ ప్రశ్నించింది. తానెవరో తనకే ఎరుక! అంటూ అభిమానులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు.

## కుమార్తె గురించి ప్రియాంక చోప్రా ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా- తనకన్నా పదేళ్లు చిన్నవాడైన నిక్ జోనాస్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. వివాహం అనంతరం జంట అమెరికాలో కాపురం పెట్టింది. పీసీ హాలీవుడ్ కి ప్రమోట్ అవ్వడం సహా వరుసగా అవకాశాలు వస్తుడటంతో పాటు...భర్త కూడా అక్కడే రాణించే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇలా కెరీర్ పరంగా అమెరికాలో అయితేనే బాగుంటుందని జంట అక్కడే స్థిరపడ్డారు. మరి ఈ జంట ఇంకా పిల్లలు ప్లాన్ చేయలేదా? ఇంకా కెరీర్ పైనే పరుగులు పెట్టే ప్లాన్ లోఉన్నారా? అంటే క్లారిటీ మిస్ అవ్వుతాంగానీ..ఇటీవలే సరోగసి విధానం ద్వారా ప్రియాంక చోప్రా తల్లి అయిన సంగతి తెలిసిందే. ఈ విధానం పీసీ కుమార్తె కు తల్లిగా మారింది. అయితే ఈ విషయాలేవి పీసీ ఇప్పటివరకూ వెల్లడించలేదుగానీ కుమార్తె పెంపకంపై మాత్రం ఆసక్తిర వ్యాఖ్యలు చేసింది. "కొత్తగా తల్లినయ్యా. తల్లులు అందరిలాగే నాకు పెంపకం విషయంలో కొన్ని భయాలున్నాయి. కానీ వాటిని నా కుమార్తె పై రుద్దను. పిల్లలు మీ ద్వారా వస్తారు. కానీ మీ నుంచి కాదు. అందుకే వాళ్లని అన్నింట్లో కంట్రోల్ చేయాలనే విషయాన్ని నేను నమ్మను. జీవితం గురించి తెలుసుకోవడానికి..దాన్ని నిర్మించుకోవడానికి వారు మీరు ఒక వాహకం మాత్రమే. అది నాకు ఎంతో ఉపయోగపడింది. ఎందుకంటే నా తల్లిదండ్రులు అదే విధంగా నన్ను పెంచారు అని పీసీ తెలిపింది. "నా కుమార్తెకు ఏ పేరు పెట్టాలో తెలియలేదు. తొందరగా నిర్ణయం తీసుకోలేకపోతున్నాను. కానీ ఆపేరుకి ఓ ప్రత్యేకత ఉండాలని బలంగా కోరుకున్నాం. ఇంతవరకూ అంతటి అద్భుతమైన పేరు తట్టలేదు. మా ఇద్దరికి నచ్చే పేరుని పాపకి పెడతామని" తెలిపింది. మొత్తానికి పీసీ తల్లి అయింది. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలు సరోగసీ విధానంలోనే పిల్లలు కనడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అందుకు చాలా రకాల కారాణలు ఉన్నాయి. కొన్ని ఆరోగ్య పరంగా వ్యక్తిగతమైతే..మరికొన్ని గ్లామర్ ఫీల్డ్ ఇబ్బందులు ఎదురవుతాయన్న కారణంగా సరోగసి విధానానికి పెద్ద పీట వేస్తున్నారు. సరోగసి అంటే.."సరోగసీ అనేది సహాయక పునరుత్పత్తి-ఆధారిత విధానం. దీనిలో ఉద్దేశించిన తల్లిదండ్రులు సర్రోగేట్ మదర్ అని పిలువబడే మరొక స్త్రీకి గర్భధారణ జననాన్ని అప్పగిస్తారు.

## రంజైన రతిరేయి రసగులిక

అందానికి అందం ప్రతిభ ఒకే ఒరలో ఇమిడితే ఎలా ఉంటుందో చూపించింది కన్నడ బ్యూటీ నభా నటేష్. నటించిన కొద్ది సినిమాలతోనే సత్తా ఉన్న యువనాయికగా పేరు తెచ్చుకుంది. ఇస్మార్ట్ శంకర్ లో రామ్ తో పోటీపడుతూ నటించి మెప్పించిన ఈ బ్యూటీ ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీ బిజీగా ఉంది. దానికి మించి వరుస ఫోటోషూట్లతో నిరంతరం కుర్రకారుకు కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తోంది. తాజాగా నభా ట్రెడిషనల్ లెహంగా లుక్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. నభా రెడ్ హాట్ లెహంగా రెడ్ టాప్ ధరించి దానికి కాంబినేషన్ యాక్సెసరీస్ తో రాకుమారినే తలపిస్తోంది. నభా



హాటెస్ట్ అవతార్ మంత్రముగ్ధం చేస్తోంది. ఈ ఫోటోని యూత్ వాట్సాప్ లలో వైరల్ గా షేర్ చేస్తున్నారు. రతిరేయి రసగులికను తలపిస్తోంది! అంటూ యూత్ జోరుగా కామెంట్లు చేస్తున్నారు. నభా రొమాంటిక్ మూడ్ లోకి తీసుకెళ్లిందన్న వ్యాఖ్యలు కొన్ని వైరల్ అవుతున్నాయి. నభా నటేష్ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇస్మార్ట్ శంకర్ తో లైమ్ లైట్ లోకి వచ్చిన ఈ బ్యూటీ డిస్కోరాజా అల్లుడు అదుర్స్ మాస్ట్రో చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది. అన్ని పెద్ద ప్రాజెక్ట్ లే.

కానీ వైఫల్యాలు ఎదురయ్యాయి. ఇక ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఈ బ్యూటీ పారితోషికం భారీగా పెంచేసిందని గుసగుసలు వినిపించాయి. ఇస్మార్ట్ శంకర్ తర్వాత చేసిన సినిమాలన్నింటికి భారీగానే ఛార్జ్ చేసిందని టాక్ వినిపించింది. ఈ కారణం తో దర్శక.. నిర్మాతలు దూరం పెట్టారని కథనాలొచ్చాయి. కానీ ఇంతలోనే నభా మళ్లీ షైన్ అవుతోంది.

## సమంత కన్ఫ్యూజ్ చేస్తుందా..క్లారిటీ ఇస్తుందా?

టాలీవుడ్ లో వున్న చూడముచ్చటైన జంట.. మేడ్ ఫర్ ఈచ్ అదర్ గా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన జంట అంటూ నాగచైతన్య - సమంత జంటపై వినిపించని ప్రశంసలు లేవు. అయితే ఒక్కసారిగా ఈ జంట షాకిచ్చింది. నాలుగేళ్ల వైవాహిక జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టేస్తున్నట్టుగా ప్రకటించి ఆశ్చర్యపరిచింది. ఏంటీ ఇది నిజమేనా? అని అంతా అవాక్కయ్యేలా చేసింది. ఈ జంట ప్రయాణం నాలుగేళ్లకే మూన్నాళ్ల ముచ్చటవుతుందని ఎవరూ ఊహించలేదు. అభిమానులు ఇదొక జోక్ అని కొట్టి పారేశారు. కానీ అదే నిజమని తెలిసి షాక్ లో వుండిపోయారు. టాలీవుడ్ తో పాటు దక్షిణాది సినీ వర్గాల్లోనే ముచ్చటైన జంటగా పేరు తెచ్చుకున్న నాగచైతన్య - సమంత విడిపోతున్నామని ప్రకటించి ఇప్పటికి దాదాపుగా 7 నెలలు కావస్తోంది. విడాకులు ప్రకటించిన తరువాత నాగచైతన్య తన సినిమా రిలీజ్ లో భాగంగా మీడియా ముందుకొచ్చారు. కానీ ముందే మీడియాని ఈ విషయంలో కట్టడి చేయడంతో చై నుంచి పెద్దగా సమాధానాలు రాలేదు. విడిపోవడానికి కారణాలు కూడా చెప్పలేదు. ఇదిలా వుంటే సామ్ కూడా విడాకులు ప్రకటించిన దగ్గరి నుంచి మీడియాకు దూరంగా వుంటూ వస్తోంది. పుష్పలో ఐటమ్ సాంగ్ చేసినా దీని ప్రచారం



కోసం మీడియా ముందుకు రాలేదు. మేకర్స్ కూడా సామ్ ని ఈ విషయంలో ఫోర్స్ చేయలేదు. దీంతో సామ్ మీడియా ముందుకొచ్చి దాదాపు 7 నెలలు కావస్తోంది. ఈ నేపథ్యంలో సమంత త్వరలో మీడియా ముందుకు రాబోతోందనే వార్త ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సమంత నటించిన తమిళ చిత్రం కాదువాకుల రెండు కాదల్. తెలుగులో ఈ మూవీని కణ్మని రాంబో ఖతీజా పేరుతో విడుదల చేస్తున్నారు. ఏప్రిల్ 28న ఈ మూవీ తమిళ తెలుగు భాషల్లో ఏక కాలంలో విడుదల కాబోతోంది. విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రంలో నయనతార కూడా ఓ హీరోయిన్ గా నటించింది. నయన బాయ్ ఫ్రెండ్ విఘ్నేష్ శివన్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా సమంత త్వరలో మీడియా ముందుకు రాబోతోంది. చైతో విడాకులు ప్రకటించిన దగ్గరి నుంచి ఇండైరెక్ట్ గా విడాకులపై సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ లు పెడుతూ చర్చనీయాంశంగా మారిన సామ్ త్వరలో మీడియా ముందు రాబోతుండటంతో మీడియా వర్గాలు సామ్ నుంచి విడాకులకు సంబంధించిన ఆసక్తికర విషయాలని రాబట్టాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారట.

గడిచిన కొంత కాలంగా విడాకుల ఇష్యూపై ఎక్కడా పెదవి విప్పని సమంత తొలిసారి తెలుగు మీడియా ముందు మాట్లాడే అవకాశం వుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మీడియా ముందుకు రానున్న సమంత కన్ఫ్యూజ్ చేస్తుందా..క్లారిటీ ఇస్తుందా? అని అంతా ఆరా తీస్తున్నారు. నిజంగానే సామ్ తన విడాకుల విషయంలో ఏం జరిగిందో క్లారిటీ ఇస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది. ఏం జరగనుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.




# గులాబీమయమైన లోహా పట్టణం.. బీఆర్ఎస్ సభకు మహా ఏర్పాట్లు

హైదరాబాద్ : మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కంధార్ నియోజకవర్గం లోహా పట్టణంలో 26న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బైల్ బజార్‌లో 15 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణం ముస్తాబవుతున్నది. ప్రధాన రహదారులను గులాబీ తోరణాలు, భారీ హోర్డింగులతో ముస్తాబు చేస్తున్నారు.

బహిరంగ సభ ని ర్వహణ ఏర్పాట్లను ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు మాణిక్‌రావు కదం, కంధార్ మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గె, కన్నాడ్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ జాదవ్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలో కాంగ్రెస్, బీజేపీ, శివసేన కాకుండా మరే పార్టీ కూడా ఈ స్థాయిలో సభను నిర్వహించలేదు. దీంతో సభా ఏర్పాట్లను చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

**ప్రజల్లోకి తెలంగాణ పథకాలు :** బీఆర్ఎస్ నేతలు బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే మరోవైపు తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో కలియ తిరుగుతున్నారు. పర్భణి, లాతూర్, నాందేడ్ లోక్‌సభా నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఊరూరా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా కంధార్, లోహా, కన్నాడ్, డెగులూర్, పూర్ణా, గంగాఖేడ్, ముదే?డ్, పత్రి, పాలా, చందోలి, చౌక్, మన్వర్, అహ్మదాపూర్, ధర్మాబాద్, బిలోలితోపాటు ఇతర నియోజకవర్గాలు, తాలూకాలను చుట్టివస్తూ.. అక్కడివారితో ముచ్చటిస్తున్నారు. తెలంగాణ పథకాలు, అభివృద్ధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. 26న నిర్వహించే సభకు భారీగా తరలిరావాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్‌పార్టీ శ్రేణులకు గ్రామగ్రామాన ప్రజలు నీరాజనం పలుకుతున్నారు.

**తెలంగాణ పథకాలకు ఫిదా: ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి –** లోహా సభ ఏర్పాట్లు ముగింపు దశకు చేరుకొన్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కంధార్ లోహా పట్టణవాసులతోపాటు పర్భణి, లాతూర్, నాందేడ్ జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల ప్రజలు తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధితో తమ అభివృద్ధిని పోల్చి చూసుకొంటున్నారని, అనతికాలంలోనే కేసీఆర్ పాలనలో తెలంగాణలో అన్ని రంగాల్లో వచ్చిన మార్పులను చూస్తూ ఆశ్చర్యపడుతున్నారని వివరించారు.

తెలంగాణలో అమలవుతున్న పింఛన్లు, రైతు బంధు, రైతు బీమాలాంటి పథకాలు తమకూ కావాలని ఇక్కడి ప్రజలు కోరుకొంటున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్‌కు మరాఠా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు.

# బీజేపీకి ఆర్థికం కంటే రాజకీయమే ప్రాధాన్యం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : పార్లమెంటరీ ప్యానెల్ నివేదికపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. వ్యాపారవేత్తలను ఆకర్షించడంలో దేశం విఫలమైందన్న ప్యానెల్ పేర్కొంది. చైనా నుంచి బయటకు వచ్చే వ్యాపారులను ఆకర్షించలేదని నివేదికలో పేర్కొనడం జరిగింది. బీజేపీకి ఆర్థికం కంటే రాజకీయమే ప్రాధాన్యమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాజకీయానికి ప్రాధాన్యమిస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. టెలిప్రాంప్టర్ చూసి ప్రసంగించడం సులువే. పటిష్ట ప్రయత్నాలు లేకపోతే ఫలితాలు రావడం కష్టం అని కేటీఆర్ పేర్కొన్నారు.



# బండి సంజయ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చిన సిట్..



హైదరాబాద్ : టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో ఆరోపణలు చేసిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు సిట్ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈ నెల 26న సిట్ ఎదుట హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. ఇదివరకే సిట్ అధికారులు బండి సంజయ్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. పార్లమెంటు సమావేశాలు ఉన్నందున ఈ నెల 24న రాలేనని ఆయన సిట్ అధికారులకు లేఖ రాశారు. దీంతో మరోసారి నోటీసులు ఇచ్చారు. మరోవైపు 'మా నౌకరీలు మాగ్గావాలే' నినాదంతో హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద భాజపా చేపట్టనున్న మహాధర్నాలో బండి సంజయ్, పార్టీ నేతలు పాల్గొననున్నారు.

# టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ కేసులో మరొకరిని అదుపులోకి తీసుకున్న సిట్..




హైదరాబాద్ : టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ కేసులో మరొకరిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్ నగర్ జిల్లా నవాబ్‌పేట్ ఉపాధి హామీ విభాగంలో పని చేసే ఉద్యోగి ప్రశాంత్‌ను సిట్ అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. పేపర్ కొనుగోలు చేసి అతడు పరీక్ష రాసినట్లు గుర్తించారు. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన కీలక సమాచారంతో ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజశేఖర్ రెడ్డికి బావ అయిన ప్రశాంత్.. గ్రూప్ వన్ పరీక్ష రాసి 100కు పైగా మార్కులు తెచ్చుకున్నట్లు సిట్ ఆధారాలు సేకరించింది.

# రాహుల్ గాంధీపై అనర్హత అప్రజాస్వామికం: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ : రాహుల్ గాంధీపై పార్లమెంట్ అనర్హత వేటువేయడాన్ని అటవీ పర్యావరణ, న్యాయ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నిర్మల్ నియోజకవర్గం సోన్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రశ్నించే గొంతు నొక్కేందుకు బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందని ఆరోపించారు. కోర్టు తీర్పు ఇచ్చిన 24 గంటల లోపే ఈ నిర్ణయాన్ని ప్రకటించడం దారుణమన్నారు. ఇది అప్రజాస్వామికమని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని అన్నారు. ఇలాంటి అమానుష చర్యలను పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.



# ఫిష్ పాండ్ కోసం గుంత తవ్వుతుండగా.. 27 వెండి నాణేలు లభ్యం



కరీంనగర్ : తిమ్మాపూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు.. ఇదే గ్రామంలోని పాత ఊరు వద్ద ఫిష్ పాండ్ కోసం గుంత తవ్వుతుండగా 27 వెండి నాణేలు దొరికిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల కిందనే ఇవి లభ్యమైనట్లు తెలుస్తుండగా కూలీలు తలా కొన్ని పంచుకొని తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు శుక్రవారం గ్రామానికి వెళ్లి కూలీలు తీసుకెళ్లిన నాణేలను స్వాధీనం చేసుకుని పంచనామా చేశారు. ఒక్కో నాణెం తులం బరువు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. అయితే గతంలో కూడా ఈ ప్రాంతాల్లో వ్యవసాయం కోసం భూమి చదును చేస్తుండగా పలువురికి ఇలాంటి నాణేలు దొరికాయని స్థానికులు చెబుతున్నారు.



# అదానీపై ప్రశ్నించినందుకే నాపై అనర్హత..

## జైలుకు పంపినా వెనక్కి తగ్గను

## ప్రజల కోసం ప్రశ్నిస్తూనే ఉంటా

అదానీ షెల్ కంపెనీలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అనర్హత వేటు తర్వాత తొలిసారిగా మీడియా ముందుకు వచ్చిన ఆయన.. "అదానీ కంపెనీల్లో ఎవరు పెట్టుబడి పెట్టారో చెప్పాలి. అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన షెల్ కంపెనీలు డిఫెన్స్ సెక్టార్‌తో ముడిపడి ఉన్నాయి. ఒక చైనా జాతీయుడికి కూడా ఈ పెట్టుబడులతో లింక్ ఉంది. అందుకే ఆ పెట్టుబడుల వివరాలేంటో చెప్పాలని అడిగాను. ప్రజల్లోనే ఉంటాను.. భారత్ జోడో యాత్రలో ప్రజల్లోకి వెళ్లాను. నేను భారత దేశ ప్రజాస్వామ్యం కోసం పోరాడాను. పోరాడుతూనే ఉంటాను. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వ్యక్తివే అయితే నాకు మాట్లాడే అవకాశం లేకుండా ఎందుకు చేస్తున్నావు? భారత ప్రజల ప్రజాస్వామిక గొంతు వినిపించేందుకు, కాపాడేందుకు నేనిక్కడ ఉన్నాను. నేను దేనికీ భయపడను. రాజకీయ పార్టీలకు ఇదివరకటిలా మీడియా సంస్థల నుంచి లభించిన మద్దతు ఇప్పుడు లేదు. ఇది ఓబీసీల వ్యవహారం కాదు. ఇది మోదీ–అదానీల సంబంధానికి సంబంధించిన వ్యవహారం. దాన్నుంచి దృష్టి మళ్లించడం కోసం విదేశాల్లో నా వ్యాఖ్యల గురించి మాట్లాడతారు. అనర్హత అంశాన్ని తీసుకొస్తారు. ఇప్పుడు ఓబీసీ అంటున్నారు. నేను నిజం మాట్లాడతాను. మాట్లాడుతూనే ఉంటాను. నాపై అనర్హత వేటు వేసినా, జైల్లో పెట్టినా నాకు పెద్ద తేడా ఏమీ లేదు. అనర్హతలు లాంటివి నన్ను ఏమి చేయలేవు. ఇలాంటి వాటిని నేను పట్టించుకోను. నా పోరాటాన్ని యధావిధిగా కొనసాగిస్తాను. మోదీకి ప్రశ్నిస్తూనే ఉంటాను. ఇది ఓబీసీ వ్యవహారం కాదు... మోదీ, ఆదానీ మధ్య ఉన్న బంధం పై ప్రశ్నిస్తున్నాను. రూ. 20 వేల కోట్లు ఎక్కడివి, ఎక్కడి నుంచి ఆదానీ షెల్ కంపెనీల్లోకి వచ్చాయో చెప్పాలి. ఈ దేశం నాకు ప్రేమ, ఆప్యాయత సహా అన్నీ ఇచ్చింది. కేసు, శిక్ష, తదుపరి కార్యాచరణ గురించి ప్రశ్నిస్తే.. నేను దేశ న్యాయవ్యవస్థను గౌరవిస్తాను. అందుకే న్యాయపరమైన అంశాల గురించి నేను ఇప్పుడు మాట్లాడను. నా తదుపరి ప్రసంగం గురించి ప్రధాని భయపడ్డారు. పార్లమెంటులో నేను మాట్లాడబోయే అంశాల గురించి మోదీ భయపడ్డారు. నాపై అనర్హత వేటు వేయడానికి అదే కారణం. నాకు సంఘీభావం, మద్దతు ప్రకటించిన విపక్షాలకు కృతజ్ఞతలు. అందరం కలసికట్టుగా పనిచేద్దాం. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నా, లేకున్నా నా పని నేను చేసుకుంటా. నేను పార్లమెంటులో ఉన్నా, బయట ఉన్నా నా పని నేను చేస్తాను. నన్ను జైల్లో పెట్టినా సరే నా పని నేను చేస్తాను. ప్రధాని ప్రతి పక్షాలకు ఒక గట్టి ఆయుధాన్ని ఇచ్చారు. ప్రధాని చర్యలతో ఆయన చేసిన తప్పు గురించి చర్చ జరుగుతోంది. అదానీ ఒక అవినీతి, అక్రమా ర్కుడని ప్రజలందరికీ తెలిసిపోయింది. అలాంటి వ్యక్తిని ప్రధాని మోదీ ఎందుకు కాపాడాలని చూస్తున్నారని జనం చర్చించుకుంటున్నారు. అదానీ గురించి అడిగితే.. దేశంపై దాడి అంటున్నారు. అంటే అదానీయే దేశం అని ప్రధాని చెబుతున్నారా?" అని రాహుల్ గాంధీ తెలిపారు.



# అమృత్‌పాల్ ఉత్తరాఖండ్‌లో ఉన్నాడా?

పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్న ఖలిస్థానీ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్ దేశం దాటేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మార్చి 20న హరియాణాలో ఉన్న అతడు.. ప్రస్తుతం ఉత్తరాఖండ్ చేరుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచి నేపాల్ మీదుగా కెనడా వెళ్లేందుకు అతడు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో భారత్–నేపాల్ సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. అతడి పోస్టర్లను అంటించారు. అమృత్‌పాల్‌ను అరెస్టు చేసేందుకు గత శనివారం పోలీసులు పక్కా వ్యూహంతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినప్పటికీ అతడు తప్పించుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి వారం రోజులుగా అతడి ఆచూకీ కోసం పోలీసులు అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే పంజాబ్ నుంచి పారిపోయిన అతడు.. హరియాణాలోని కురుక్షేత్ర జిల్లాలో ఓ మహిళ ఇంట్లో తలదాచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కడకు వెళ్లి సోద చేయగా.. అప్పటికే అతడు పారిపోయినట్లు తెలిసింది. మరోవైపు కురుక్షేత్రలో ఓ వీధిలో అతడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లిన సీసీటీవీ దృశ్యాలు బయటకు వచ్చాయి.

అందులో ముఖం కన్పించకుండా ఉండేందుకు అమృత్‌పాల్ గొడుగు అడ్డు పెట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం అతడు ఉత్తరాఖండ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. హరియాణాలో అతడికి ఆశ్రయమిచ్చిన బల్జీత్‌కౌర్ అనే మహిళను పోలీసులు అరెస్టు చేసి విచారించారు. అమృత్‌పాల్ ఉత్తరాఖండ్ వెళ్లాడని ఆమె విచారణలో వెల్లడించినట్లు పోలీసు వర్గాల సమాచారం. దీంతో ఆ రాష్ట్రానికి అలర్ట్ జారీ చేశారు. ఉత్తరాఖండ్ నుంచి అతడు నేపాల్ పారిపోయేందుకు యత్నించే అవకాశాలున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో భారత్–నేపాల్ సరిహద్దుల్లో చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. అతడిని పట్టుకునేందుకు సరిహద్దుల్లో పోస్టర్లు కూడా అంటించారు.

# 15 ఎకరాలకే కటాఫ్.. రైతుబంధుపై షాకిచ్చిన కేసీఆర్

హైదరాబాద్ : తెలంగాణలో బీఆర్ఎస్ ను రెండోసారి అధికారంలోకి తీసుకొచ్చిన పథకం 'రైతుబంధు' అని చెప్పుకుంటున్నారు. పెట్టుబడి సాయం కింద ప్రతీ ఏడాదికి రైతుకు రూ.10 వేల చొప్పున ప్రభుత్వం సాయం చేస్తోంది. అయితే పరిమితి లేకుండా లక్షల ఎకరాలున్న వారికీ ఈ సాయం అందుతోంది. దీంతో కొంతమంది భూ స్వామిదారులకు పథకం ప్రయోజనకరంగా ఉందన్న ఆరోపణలు వచ్చాయి. ఆ మధ్య ఓ మంత్రి ఏడాదికి రూ.కోటి 20 లక్షలు రైతు బంధు వస్తున్నట్లు ఆయనే స్వయంగా చెప్పారు. దీంతో రైతుబంధు బీఆర్ఎస్ లీడర్లు ఉన్న వర్గానికి చెందినవారిదే అన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా 15 ఎకరాల వరకే రైతు బంధు అందినట్లు సమాచారం. మిగతా వారు రైతు బంధు డబ్బులు ఎప్పుడు వస్తాయా? అని ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. 'రైతు బంధు' సాయం పరిమితి లేకుండా తెలంగాన ప్రభుత్వం ఇస్తోంది. దీంతో వందల ఎకరాలు ఉన్న వారికి లక్షల రూపాయలు అకౌంట్లో పడుతున్నాయి. దీంతో చాలా మంది డబ్బున్న వారు మారుమూల ప్రాంతాల్లో భూములు కొనుగులో చేసి రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారు. సాగు చేయకున్నా రైతు బంధు సాయం పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం రైతు పెట్టుబడిగా రూ.2 వేలు అందిస్తోంది. అయితే 5 ఎకరాల లోపు ఉన్నవారికే పరిమితి విధించింది. ఈ నేపథ్యంలో 5 ఎకరాల లోపు ఉన్నవారికే రైతు బంధు ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. తాజాగా 15 ఎకరాల లోపు ఉన్నవారికే రైతుబంధు డబ్బులు పడ్డాయి. అంతకంటే ఎక్కువ ఉన్నవారు తమ ఖాతాల్లో జమ కాకపోవడంతో ఎంక్వైరీలు చేస్తున్నారు. రైతుబంధు కోసం చిన్న రైతులు కాకుండా బడాబాబులే ఎక్కువగా ఎదురుచూస్తున్నారు. కొందరు రాజకీయ నేతలు అధికారులు సైతం ఎకరాల కొద్దీ భూములు కొన్న వారికి ప్రతీ ఏటా కోట్ల రూపాయలు అప్పనంగా ఖాతాల్లో పడుతున్నాయి. కానీ ఈసారి రాకపోయేసరికి వారిలో ఆందోళన నెలకొంది. దీంతో కేసీఆర్ 15 ఎకరాలకే పరిమితం చేశారా? అన్న చర్చ సాగుతోంది. అయితే పరిమితి విధిస్తే కేసీఆర్ ముందే ప్రకటించేవారని అంటున్నారు. ప్రభుత్వం ఖాజానాలో నిధులు లేకపోవడంతో రైతుబంధు డబ్బులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే 10 ఎకరాల లోపు ఉన్నవారికి రైతుబంధు వేయకపోతే తీవ్ర వ్యతిరేకత వస్తుందని అందుకే 15 ఎకరాల వరకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఆ పైన ఉన్నవారు రైతుబంధు వచ్చినా రాకపోయినా పెద్దగా అడిగే ప్రసక్తి ఉండదని అదుకే అక్కడికే కటాఫ్ చేశారని అంటున్నారు. కానీ సాగు చేయకున్నా రైతుబంధు డబ్బులు పొందేవారు మాత్రం ఈసారి డబ్బులు పడకపోయేసరికి ఆందోళన వ్యక్తమవుతోంది. కొంత మంది పట్టణాల్లో నగరాల్లో ప్లాట్లను అమ్మి మరీ వ్యవసాయ భూములు కొన్నారు. మరికొందరు అప్పులు చేసి కొనుగోలు చేశారు. ఈ తరుణంలో రైతుబంధు 15 ఎకరాలకు పరిమితి చేస్తే వారి పరిస్థితి అయోమయంగా మారనుంది. రైతుబంధు పై పెట్టుకున్న ఆశలు అడియాశలవుతాయిన అంటున్నారు.



# పంజాగుట్ట చౌరస్తాలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం.. ఏప్రిల్ 14న ఆవిష్కరణ

హైదరాబాద్: హైదరాబాద్‌లోని పంజాగుట్ట చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వచ్చే నెల 14న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటు పనులను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి చాలా ఏండ్లుగా డిమాండ్ ఉన్నదని, దీనిపట్ల మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నామని స్పష్టం చేశారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com